


కందిపప్పు.. కొందరికే

పండుగ వచ్చింది.. పప్పన్నం చేసుకుందామని పేదలు అనుకున్నారు. ఈ నెల నుంచి కార్డుదారులకు ఇచ్చే రేషన్‌లో కందిపప్పు సహా గతంలో మాదిరిగా అన్ని సరుకులు ఉంటాయని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. అయితే పేదలకు ఈ నెలలోనూ అది వీలయ్యేలా లేదు. మంత్రి ప్రకటించారు.. కందిపప్పు పంపిణీ చేశారు.. అయితే అది అందరికీ కాకుండా కొందరికే అందుతుంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 17.30 లక్షలు కార్డులు ఉంటే కేవలం 81,243 కందిపప్పు ప్యాకెట్లను సరఫరా చేశారు. ఒక్కో రేషన్ దుకాణం పరిధిలో సుమారు 600 నుంచి 800 కార్డుదారులు ఉండగా వంద కేజీలు మాత్రమే కందిపప్పు సరఫరా అయింది. వీటిని కార్డుదారులకు ఏవిధంగా కేటాయించాలో అర్థంకాక ఎండీయూ ఆపరేటర్లు ఆందోళన చెందుతున్నారు. ఇక చక్కెర పరిస్థితి కూడా ఇలాగే ఉంది. 17.30 లక్షల కార్డులు ఉంటే 2.23 లక్షల ప్యాకెట్లు మాత్రమే సరఫరా అయ్యాయి. పండుగ నెలలో కూడా కందిపప్పు, చక్కెర ఇవ్వకపోవడంపై కార్డుదారులు ఎండీయూ ఆపరేటర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి ప్రకటించారు కదా.. మాకెందుకు ఇవ్వరు అని మండిపడుతున్న కార్డుదారులకు ఏమి సమాధానం చెప్పాలో తెలియక వారు అయోమయంలో ఉన్నారు.

- మంత్రి ప్రకటించినా అరకొరగా పంపిణీ
- ఒక్కో రేషన్ షాపునకు 100 కేజీలు మాత్రమే
- ఎలా సర్దుబాటు చేయాలో తెలియని స్థితిలో ఎండీయూలు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో చక్కెర సరఫరా కూడా అంతంతే

గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం కేజీ కందిపప్పు రూ.150కి పైగా ఉంది. ఈ తరుణంలో రేషన్ దుకాణాల ద్వారా తెల్లకార్డుదారులకు కేవలం రూ.67కే పంపిణీ చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేసిన ప్రకటన కొద్దిమందికే లబ్ధి చేకూర్చనుంది. ఇందుకు కారణం అరకొరగానే కందిపప్పు నిల్వలను దుకాణాలకు పంపడమే. గుంటూరు నగరంలో ఒక్కో రేషన్ షాపులో 800లకు పైగా కార్డులుంటే కేవలం క్వింటాల్ కందిపప్పు మాత్రమే స్టాకు వచ్చినట్లు డీలర్లు తెలిపారు. దీంతో మిగతా వాళ్లకి ఏమి సమాధానం చెప్పాలో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. చక్కెర ప్యాకెట్లు కూడా ఇవ్వలేదని, వీటిపై తాము కార్డుదారులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోతున్నామని తెలిపారు. మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ నెల 1వ తేదీన నిత్యావసర సరుకుల పెరుగుదల నుంచి రేషన్ కార్డుదారులకు ఉపశమనం కలిగించేందుకు తెనాలి నుంచి కందిపప్పు, చక్కెర పంపిణీని ప్రారంభించారు. దసరా నవరాత్రులు గురువారం నుంచి ప్రారంభం కానుండటంతో పండుగకి ఎంతో కొంత ఆర్థికభారం తగ్గుతుందని అంతా భావించారు. అయితే పౌరసరఫరాల సంస్థ రేషన్ దుకాణాలకు కనీసం 20 శాతం కందిపప్పు, పంచదార స్టాకు కూడా పంపలేదు. మరోవైపు మంగళవారం నుంచే ఈ నెల సరుకుల పంపిణీని ఎండీయూలు, రేషన్ డీలర్లు ప్రారంభించారు. తొలుత వచ్చిన కొద్దిమందికి కందిపప్పు పంపిణీ చేసేసి ఆ తర్వాత వచ్చిన వారికి స్టాకు అయిపోయిందని చెప్పి కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారు. దీంతో కార్డుదారులు తీవ్ర అసంతృప్తికి గురౌతున్నారు. రిటైల్ మార్కెట్‌లో కందిపప్పు కేజీ ధర రూ.150 నుంచి ప్రారంభమౌతున్నది. రేషన్ షాపుల ద్వారా రూ.67కి పంపిణీ చేస్తే దాదాపుగా రూ.83 వరకు ఆదా అవుతుంది. రేషన్ షాపుల ద్వారా చక్కెర ధరకి, బహిరంగ మార్కెట్‌లో ధరకి పెద్దగా వ్యత్యాసం ఉండదు. ఈ నేపథ్యంలో చక్కెర ఇవ్వకపోయినా ఫర్వాలేదు. కందిపప్పు పంపిణీ చేయాలని కార్డుదారులు కోరుతున్నారు. ఎండీయూ వాహనం ఒకసారి ఒక ప్రాంతానికి వస్తే మళ్లీ అటువైపు రాదు. ఈ దృష్ట్యా ఈ నెలకు తమకు కందిపప్పు రానట్లేనని చాలామంది కార్డుదారులు బాధపడుతున్నారు. గుంటూరు జిల్లాలో 5,99,511 రేషన్‌కార్డులుంటే చక్కెర 23,118 ప్యాకెట్లు, కందిపప్పు కేవలం 2,025 ప్యాకెట్లు మాత్రమే సరఫరా చేశారు. బాపట్ల జిల్లాలో 4,86,029 కార్డులుంటే చక్కెర 68,564, కందిపప్పు 1,168 ప్యాకెట్లు సరఫరా అయ్యాయి. పల్నాడు జిల్లాలో 6,45,110 కార్డులుంటే చక్కెర 1,31,381, కందిపప్పు 78,050 ప్యాకెట్లు పంపిణీ చేశారు. దీని వలనే పంపిణీలో సమస్యలు తలెత్తుతున్నాయి.



పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

- ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపిక
- ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు అవకాశం
- పేద విద్యార్థులు ఐఐటీ, నీట్ సీట్ల సాధన లక్ష్యం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 15 వేల మందికి లబ్ధి
- జాతీయ స్థాయి పరీక్షలకు సన్నద్ధమయ్యేలా కార్యాచరణ

గుంటూరు(విద్య), అక్టోబరు 3: ఐఐటీ, నీట్ విద్యాసంస్థల్లో చదువుకోవడం అందరి కల. కానీ వీటికి సంబంధించిన పోటీ పరీక్షలకు సిద్ధమవడం డబ్బుతో ముడిపడిన అంశం. కార్పొరేట్ కళాశాల విద్యార్థులకే ఇప్పటివరకు ఆయా జాతీయస్థాయి పోటీ పరీక్షలకు శిక్షణ అందుతుంది. అయితే ఈ అవకాశాన్ని ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు కూడా కల్పించాలని ప్రభుత్వం సిద్ధమైంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులు జాతీయ స్థాయిలో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేలా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. రాష్ట్రస్థాయిలో జరిగే ఈఏపీ సెట్‌తోపాటు, జాతీయ స్థాయిలో జరిగే నీట్, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ పరీక్షలకు విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూల్స్, గురుకుల జూనియర్ కళాశాలలు, కేజీబీవీల్లో దాదాపు 15వేల మందికి పైగా విద్యార్థులు ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు ప్రతిభ ఉన్నా సరైన శిక్షణ లేని కారణంగా పోటీపరీక్షల్లో వెనుకబడిపోతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం సదరు విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తోంది.

పేదరికం కారణంగా శిక్షణకు దూరం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో అత్యధిక మంది పేద, బడుగు బలహీనవర్గాల కుటుంబాలకు చెందిన పిల్లలే. వారికి పదో తరగతి స్థాయిలో మంచి మార్కులు వచ్చినా కార్పొరేట్, ప్రైవేటు కళాశాలల్లో చదివే స్తోమత లేక ప్రభుత్వ కళాశాల్ని ఆశ్రయిస్తున్నారు. ఇంటర్ స్థాయిలో కూడా మంచి మార్కులు సాధిస్తున్నా జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సంబంధించి సరైన శిక్షణ తీసుకోలేక పోతున్నందున ఐఐటీ, నీట్ సీట్లు సాధించలేకపోతున్నారు. ఇంటర్ పరీక్షలు ముగిసిన తర్వాత ఎంసెట్, జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్, నీట్ కోసం రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు శిక్షణ కోసం వెచ్చించాల్సి వస్తోంది. ఇంత మొత్తం వెచ్చించలేక పేద విద్యార్థులు ఇటువంటి శిక్షణకు దూరమౌతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఇచ్చే శిక్షణ వారికి ఎంతో ఉపయోగ పడనుంది.

విద్యార్థుల ఎంపిక ఇలా..

నీట్, జేఈఈ శిక్షణకు సంబంధించి ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక పోటీ పరీక్ష నిర్వహించనున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలోనే ఈ పరీక్ష నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఈ విద్యార్థులకు ప్రముఖ కార్పొరేట్ సంస్థ నారాయణ కళాశాల సహకారంతో మాక్ టెస్టులు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాలల్లోనే దశల వారీగా శిక్షణ ఇచ్చి పరీక్షలకు సన్నద్ధం చేస్తారు. దసరా సెలవుల తర్వాత విధివిధానాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఇంటర్ బోర్డు అధికారులు చెబుతున్నారు.

- వైభవంగా దసరా ఉత్సవాలు ప్రారంభం

బాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు


అమరావతిలో రజిత కవచ ధారిణిగా బాలచాముండికా దేవి మూలవిరాట్

నరసరావుపేట, అక్టోబరు 3: దసరా శరన్నవరాత్ర మహోత్సవాలు జిల్లాలో గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాల వద్ద అమ్మవారి భారీ విద్యుత్ కటౌట్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో ప్రత్యేక పందిళ్లను కూడా ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారి ప్రత్యేక అలంకారాలను దర్శించుకుని పూజలు చేశారు. నరసరావుపేట పాతూరులోని శ్రీగంగా పార్వతి సమేత శ్రీభీమలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవికి బాల అలంకారం చేశారు. సత్తెనపల్లిరోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి బాల అలంకారం చేశారు. శృంగేరి శంకరమఠంలో శ్రీశారదాంబ అమ్మవారికి బ్రాహ్మీ అలంకారం చేశారు. పాత గడియార స్తంభం సెంటర్‌లో మహాలక్ష్మమ్మ చెట్ల వద్ద, పాల శీతలీకరణ కేంద్రంలో దసరా ఉత్సవాలు జరిగాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో అమ్మవారు రజిత కవచధారిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లను దర్శించిన భక్తులకు తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మహిళలు బతుకమ్మలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు.


పిడుగురాళ్లలో ప్రత్యేక అలంకరణలో వాసవి అమ్మవారు

అమృత్ పనులను వేగవంతం చేయాలి

- పనులపై ఎమ్మెల్యేలతో కలెక్టర్ అరుణ్‌బాబు సమీక్ష


సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యేలు కన్నా, జీవీ, జూలకంటి, అరవిందబాబు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు

నరసరావుపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు విడతల్లో చేపట్టిన అమృత్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. అమృత్ పథకంపై కలెక్టరేట్‌లో గురువారం ఎమ్మెల్యేతో సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలో అమృత్‌పథకం మొదట విడత కింద రూ.13.53కోట్లతో చేపట్టిన పనులు 99శాతం, చిలకలూరిపేటలో రూ.8.82కోట్లతో చేపట్టిన తాగునీటి పథకం పనులు 94శాతం పూర్తి అయ్యాయన్నారు. నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాంతాల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, వాటర్ సరఫరాకు సంబంధించి రూ.153 కోట్లతో చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. వరికపూడిశెల ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి కోరారు. ప్రాజెక్టు ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదికలు అందజేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో రహదారులు మౌలిక సదుపాయాల గురించి చర్చించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన అన్నదాతలను ఆదుకోవాలని, నష్ట పరిహారంపై అంచనాలు వేసి ప్రతి ఒక్కరికి న్యాయం చేసేలా చూడాలని కలెక్టర్‌ను ఆయన కోరారు. ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, జీవీ ఆంజనేయులు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

సాగు.. 69.96 శాతం

- తగ్గిన పత్తి.. పెరిగిన కంది, పొగాకు
- సాగర్ ఆయకట్టులో ముమ్మరంగా వరి..
- పుష్కలంగా నీరున్నా తలకిందులైన సాగు
- అధిక వర్షాలతో పల్లపు ప్రాంతాల్లో ఉరకెత్తిన పత్తి
- పత్తికి ప్రత్యామ్నాయంగా కంది, పొగాకు, మిరప సాగు
- నైరుతిలో జిల్లాలో 75.6 ఎంఎం అధిక వర్షపాతం నమోదు

పంట	సాధారణ విస్తీర్ణం	సాగు	శాతం
పత్తి	2,67,965	1,63,292	61
మిరప	1,45,505	1,00,450	69.03
వరి	1,05,237	84,258	80
అపరాలు	51,685	67,602	131

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
నైరుతిలో సమృద్ధిగా వర్షాలు కురిశాయి. కాల్వలకు పుష్కలంగా నీటి సరఫరా జరుగుతోంది. అయినా ఖరీఫ్‌లో పంటల సాగు అంచనాలు తలకిందులయ్యాయి. ఖరీఫ్ ముగిసి రబీ సీజన్ ప్రారంభమైంది. సాగర్ ఆయకట్టులో వరి సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లాలో పంటల సాగు సాధారణ విస్తీర్ణం 6,20,875 ఎకరాలు కాగా ఖరీఫ్‌లో 4.33 లక్షల ఎకరాల్లో అంటే 69.96 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. పత్తి సాగు తగ్గగా.. కంది, పొగాకు గణనీయంగా పెరిగింది. అధిక వర్షాలు పత్తి పంటను దెబ్బతీశాయి. సాగు సాధారణ విస్తీర్ణంలో 4,33,743 ఎకరాల్లో పంటల సాగైనట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. వరి, మిరప, పత్తి కంది పంటలను రైతులు సాగు చేశారు. పత్తి కాపు దశలో ఉంది. ఈ నెలాఖరుకు వరి సాగు పూర్తవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. గత నెలలో అధిక వర్షాలతో మిరప సాగులో జాప్యం జరిగింది. గతేడాది కన్నా ఈ ఏడాది పత్తి సాగు స్వల్పంగా పెరిగింది. వరి సాగు గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. మరో 50 వేల ఎకరాల్లో వరి సాగు పెరగవచ్చని అంచనా. జిల్లాలో అత్యధికంగా పత్తి సాగైనా అధిక వర్షాలతో పల్లపు ప్రాంతాల్లో పంట ఉరకెత్తింది. గత నెలలో కురిసిన అతి భారీ వర్షాలకు పత్తి పంట 21,212 ఎకరాల్లో దెబ్బతిన్నది. వేలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. దెబ్బతిన్న పత్తి పంటను కొన్ని ప్రాంతాల్లో తొలగించి మిరప సాగు చేపడుతున్నారు. పత్తి రైతులు నాలుగేళ్లుగా అతివృష్టి.. అనావృష్టితో నష్టపోతునే ఉన్నారు. పత్తికి ప్రత్యామ్నాయంగా కంది, పొగాకు, మిరప సాగు చేపట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో కంది 66,273 ఎకరాల్లో సాగైంది. నైరుతీ రుతుపవనాలు తొలిరోజుల్లో మందగించినా తదుపరి విస్తృతంగా వ్యాపించడంతో జిల్లాలో అత్యధికంగా రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. జిల్లాలో సాధారణ వర్షపాతం 511.5 ఎంఎం కాగా 587.1 ఎంఎం నమోదైంది. 75.6 ఎంఎం అధిక వర్షపాతం నమోదైంది.



కూలీల ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ

- బ్రాహ్మణపల్లి వద్ద రోడ్డు ప్రమాదం
- ఇద్దరు మృతి, మరో ఐదుగురికి గాయాలు

పిడుగురాళ్ల, అక్టోబరు 3: అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారిలో బ్రాహ్మణపల్లి జడ్పీ పాఠశాల సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన ఇద్దరు మృతి చెందగా మరో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ప్రజాశక్తినగర్, తండాకు చెందిన కొందరు ఓ ముఠాగా ఏర్పడి గృహనిర్మాణ పనులకు, శ్లాబ్ పనులకు వెళ్తుంటారు. ఇదే క్రమంలో గురువారం ఉదయం కూడా పిడుగురాళ్ల నుంచి ట్రాక్టర్‌లో దాచేపల్లి వెళ్లి సాయంత్రం తిరిగి అదే ట్రాక్టర్‌లో ఇంటికి వస్తున్న క్రమంలో బ్రాహ్మణపల్లి జడ్పీ పాఠశాల సమీపంలో పిడుగురాళ్ల వైపు వస్తున్న లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న యాసారపు గోపాల్(35) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ వడితె గోపాల్‌నాయక్, బత్తుల నాగరాజు, స్వామినాయక్, తూమాటి కృష్ణ, గాదెం నారాయణ, చల్లా తిరుపతయ్యలను ప్రథమ చికిత్స అనంతరం నరసరావుపేట తరలిస్తుండగా గోపాల్‌నాయక్ మృతి చెందాడు. పిడుగురాళ్ల సీఐ వెంకట్రావు, నామ్ ఎక్స్‌ప్రెస్‌వే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.


యాసారపు గోపాల్ (ఫైల్)
వడితే గోపాల్ నాయక్ (ఫైల్)


ప్రమాదం ధాటికి తునాతునకలైన ట్రాక్టర్

వినుకొండ-గుంటూరు రోడ్డు విస్తరణ

- నాలుగు వరసల్లో అభివృద్ధికి ఎన్‌హెచ్ఏఐ నివేదిక
- రూ.2,360 కోట్ల వ్యయం అవుతుందని అధికారుల అంచనా
- గుంటూరు నగరానికి కొత్తగా మరో బైపాసు రోడ్డు అందుబాటులోకి

గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్-544 డీలో వినుకొండ - గుంటూరు సెక్షన్‌ని నాలుగు వరసలుగా విస్తరించనున్నట్లు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అధికారులు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులకు నివేదించారు. జాతీయ రహదారుల అభివృద్ధిపై గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవతేజ, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎన్‌హెచ్ఏఐ, ఆర్ అండ్‌బీ అధికారులు హాజరయ్యారు. వినుకొండ - గుంటూరు రహదారి నాలుగు వరసలుగా అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఎన్‌హెచ్ అధికారులు వివరించారు. ఈ రహదారిని వినుకొండ వద్ద 322.800 కిలోమీటర్ వద్ద నుంచి ఎన్‌హెచ్-16కి సమీపంలో 426.400 కిలోమీటర్ వరకు విస్తరించనున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లాలో 45.10 కిలోమీటర్ల మేర పెదకాకాని, గుంటూరు తూర్పు, ఫిరంగిపురం, మేడికొండూరు, తాడికొండ మండలాల్లో నిర్మించాల్సి ఉందని చెప్పారు. ఇప్పటికే 2022 డిసెంబరు 31న ఒక దఫా సమావేశం నిర్వహించామన్నారు. ఎన్‌హెచ్-544డీ రహదారి అనంతపురం నుంచి ప్రారంభమై ముచ్చుకోట, బుగ్గ, కైప, గిద్దలూరు, వినుకొండ మీదగా గుంటూరు వరకు మొత్తం పొడవు 405 కిలోమీటర్లుగా ఉంటుందన్నారు. వినుకొండ, శావల్యాపురం, పెట్లూరివారిపాలెం, జొన్నలగడ్డ, సాతులూరు, సంతమాగులూరు, పాతమాగులూరుసంయుక్త, ఫిరంగిపురం, వేమూలూరిపాడు సంయుక్త, పేరేచర్ల, గుంటూరు సంయుక్త బైపాస్‌ల పొడవు 44.21 కిలోమీటర్లుగా ఎలైన్‌మెంట్ చేశామన్నారు. దీని వల్ల గుంటూరు నగరానికి కొత్తగా మరో బైపాసు రోడ్డు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఇది అమరావతి అవుటర్ రింగురోడ్డుతో అనుసంధానం అవుతుందన్నారు. మొత్తం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.2,360 కోట్లు అవసరమౌతాయని తెలిపారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కును అందిస్తున్న వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

అన్న క్యాంటీన్ల నిర్వహణకు ఎమ్మెల్యే రూ.10 లక్షల విరాళం

వినుకొండ, అక్టోబరు 03: అన్న క్యాంటీన్ల నిర్వాహణకు గాను వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు రూ.10 లక్షలు చెక్కును ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు అందజేశారు. ముఖ్యమంత్రిని గురువారం ఆయన కలిశారు. అనంతరం జీవీ ఆంజనేయులు విలేకరులతో మాటాడారు. ప్రజాధనంతో క్యాంపు ఆఫీసు నిర్మించుకుని సకల హంగులు, ఫర్నీచర్ సమకూర్చుకుని దాన్నే పార్టీ ఆఫీసుగా మార్చుకుని, సామాగ్రి వెనక్కి ఇవ్వక పోవడంపై కొన్ని రోజులుగా కొనసాగుతున్న వివాదంపై జీవీ స్పందిస్తూ మాజీ ముఖ్య మంత్రి జగన్ రెడ్డి అక్రమంగా తన వద్ద పెట్టుకున్న ఫర్నీచర్‌తో పాటు దోచుకున్న లక్షల కోట్ల ప్రజాధనాన్ని తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగన్ ఇడుపులపాయ, లోటస్ పాంట్, తాడేపల్లి ప్యాలెస్‌లు అన్నీ ప్రజల నుంచీ దోచుకున్న ధనంతో కట్టినవి కాదా అని ప్రశ్నించారు. అన్ని విషయాల్లో అడ్డంగా దొరికి పోయిన జగన్, మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ఫర్నీచర్ ఎందుకు వెనక్కి పంపలేదో జగన్ సమాధానం చెప్పాలని నిలదీశారు. అధికారం పోయిన తర్వాత ఫర్నీచర్ తీసుకుపొమ్మని చెప్పడానికి లేళ్ళ అప్పిరెడ్డి ఎవరని సూటిగా ప్రశ్నించారు. ఫర్నీచర్ మాత్రమే వెనక్కి ఇస్తామంటే ఒప్పుకునేది లేదని, దోచుకున్న లక్షల కోట్ల ప్రజాధనాన్ని కక్కిస్తామని అన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు చెక్కును అందజేస్తున్న లగడపాటి వెంకటరావు

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.3 లక్షల విరాళం

నూజెండ్ల, అక్టోబరు 3 : వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు డీఎల్‌డీఏ మాజీ ఛైర్మన్ లగడపాటి వెంకటరావు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సమక్షంలో రూ 3 లక్షల చెక్కును గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మండలంలో రూరల్ అర్బన్ పథకంలో భాగంగా నిర్మించిన సీసీ రోడ్ల బిల్లులు వైసీపీ ప్రభుత్వం చెల్లించక పోవడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర అర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేసినట్లు వెంకటరావు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లగడపాటి శ్రీనివాసరావు, పెమ్మసాని నాగేశ్వరరావు, సోమేపల్లి బ్రహ్మయ్య మరిడి సురేష్, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

రైల్వే పనుల్లో అలసత్వం సహించం

- గుంటూరు రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆగ్రహం
- మంత్రి వెంట ఎమ్మెల్యేలు, రైల్వే ఉన్నతాధికారులు
- అండర్ పాస్ లో డ్రైనేజ్ పైపుల లీకులు
- సమస్యలకు కారణాలపై ఆరా తీసిన మంత్రి
- ప్రతి నెలా రైల్వే ప్రాజెక్టులపై సమీక్షించి, చర్యలు

గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 3 : రైల్వే ప్రాజెక్టు పనులపై అలసత్వం వహిస్తే సహించేది లేదని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ హెచ్చరించారు. గుంటూరులోని రైల్వే స్టేషన్, అండర్ పాస్, ఆటోస్టాండ్‌లను ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్ అహ్మద్‌తో కలసి ఆయన గురువారం పరిశీలించారు. రైల్వే ప్రాజెక్టుల ప్రస్తుత పురోగతి గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైల్వే అండర్ పాస్ లో డ్రెయినేజీలు లీకై నీరు నిల్వ ఉండడాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. డ్రెయినేజీ లీకులకు గల కారణాలను వెంటనే గుర్తించి 20 రోజుల్లోగా అరికట్టాలని ఆదేశించారు. అనంతరం రైల్వే స్టేషన్ వద్ద ట్రాఫిక్ సమస్యలపై ఆటోడ్రైవర్లు, ప్రయాణికులతో పెమ్మసాని మాట్లాడారు. ఈ సందర్భంగా గుంటూరు ప్రభుత్వాస్పత్రికి ఎదురుగా ఉన్న రైల్వే స్టేషన్ ప్రధాన గేటును మారిస్తే కొంత ట్రాఫిక్ సమస్య తీరుతుందని స్థానిక ప్రజాప్రతినిధులు సూచించారు.

అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడుతూ నిధులున్నా రైల్వే కాంట్రాక్ట్ పనులు ముందుకు సాగడం లేదని, ఇక నుంచి ప్రతి నెలా వచ్చి పరిశీలిస్తామని, రైల్వే ప్రాజెక్టులపై సమీక్షిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా గుంటూరుకు రెండు మేజర్ రైల్వే ప్రాజెక్టులు మంజూరయ్యాయని తెలిపారు. వీటిలో రూ.150 కోట్లతో మల్టీ ట్రాకింగ్ కనెక్టివిటీ, రూ.40 కోట్లతో అమృత భారత్ స్కీమింగ్ ద్వారా ఇతర పనులు మంజూరైనట్లు చెప్పారు. స్కీమ్ పనుల్లో కొన్ని 70 శాతం, మరికొన్ని 20 శాతం, 40 శాతం పూర్తయ్యాయని వివరించారు. మల్టీ ట్రాకింగ్ పనుల్లో కొన్ని 53 శాతం వరకే జరిగాయని, మల్టీ ట్రాకింగ్ పనులు మార్చిలోగా పూర్తి చేస్తామని రైల్వే అధికారులు చెప్పారని అన్నారు. కార్యక్రమంలో రైల్వే డీఆర్ఎం రామకృష్ణ, రైల్వే చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ డి. మనోహర్ రెడ్డి, డీసీఎం ప్రదీప్ కుమార్, టీడీపీ కార్పొరేటర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతుల జోలికొస్తే ఊరుకోం

గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతుల జోలికి ఎవరొచ్చినా ఊరుకోం. రైతులకు ఎట్టి పరిస్థితుల్లో న్యాయం జరగాలని మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. కొందరు రైతులు గుంటూరులోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిశారు. కోల్డ్ స్టోరేజీలో భద్రపరిచిన మిర్చి బస్తాలను దొంగతనంగా అమ్ముకోవడంపై తమ సమస్యలు నివేదించారు. కర్నూలు, ఆలూరు, నంద్యాల, బళ్ళారి, పల్నాడు, మార్కాపురం ఇతర ప్రాంతాలకు చెందిన మిర్చి రైతులమైన తాము పండించిన పంటను నల్లపాడు పరిధిలోని రాఘవేంద్ర కోల్డ్ స్టోరేజ్‌లో కొన్నాళ్ల క్రితం భద్రపరుచుకున్నామని చెప్పారు. అయితే, దాని యజమాని నకిలీ వ్యక్తుల పేర్లు, ఆధార్ కార్డులతో రైతుల పేరిట బ్యాంకు రుణాలు తీసుకోవడమే గాక తాము భద్రపరచుకున్న



గుంటూరు రైల్వేస్టేషన్లో పర్యటిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు మాధవి, నసీర్ అహ్మద్, రైల్వే శాఖ ఉన్నతాధికారులు



మిర్చి బస్తాలను తమకు తెలియకుండా అమ్ముకున్నారని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనా తమ గోడు ఎవరూ పట్టించుకోవడంలేదని, న్యాయం చేయాలని బాధిత రైతులు కోరారు.దీనిపై మంత్రి తక్షణమే స్పందించి రైతుల సమక్షం లోనే ఎస్పీ సతీష్ కుమార్‌కు, రుణాలు మంజూరు చేసిన బ్యాంకర్లకు ఫోన్ చేసి మాట్లాడారు. అప్పటికప్పుడు తన కార్యాలయానికి అధికారులను పిలిపించారు. రైతుల ఎదుటే జరిగిన ఘటనపై వివరాలు సేకరించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ నిందితులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. 'అరెస్టులు కాదు రైతులకు న్యాయం జరగాలి' అని ఆదేశించారు.

నైపుణ్య గణనతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు

- తుళ్లూరు మండలంలో స్కిల్ సెన్సెస్ నిర్వహణ తీరును పరిశీలించిన కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

మంగళగిరి సిటీ, అక్టోబరు 3: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్కిల్ సెన్సెస్‌ను మంగళగిరిలో పైలట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. మంగళగిరి నియోజకవర్గంలోని మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాలతోపాటు సీఆర్డీఏ పరిధిలోని తుళ్లూరు మండలంలో నైపుణ్య గణనను ఇప్పటికే చేపట్టారు. స్కిల్ సెన్సెస్ నిర్వహణ తీరును జిల్లా కలెక్టరు ఎస్.నాగలక్ష్మి గురువారం పరిశీలించారు. స్కిల్ సెన్సెస్ కోసం వంద గ్రామ సచివాలయాల పరిధిలో 1049 మంది సచివాలయ సిబ్బందిని ఎన్యూమరేటర్లుగా నియమించారు. మంగళగిరి నియోజకవర్గంలోని 1,35,914 గృహాలు, తుళ్లూరు మండలంలో 25,507 గృహాలు కలిసి మొత్తం 1,61,421 కుటుంబాల నుంచి ఎన్యుమరేటర్లు వివరాలను సేకరిస్తారు. గ్రామ సచివాలయాలు, స్కిల్ డెవలప్‌మెంట్, సీడాప్, న్యాక్ విభాగాల సిబ్బంది స్కిల్ సెన్సెస్‌లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ నైపుణ్య గణన ద్వారా రాష్ట్రంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు వీలవుతుందన్నారు. ఆధార్ ఆధారిత ఓటీపీ, బయోమెట్రిక్ ద్వారా ఎన్యుమరేటర్లు వివరాలను సేకరిస్తారని, ఓటీపీని బహిర్గతం చేసే విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని సూచించారు. స్కిల్ సెన్సెస్ కోసం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రత్యేకంగా రూపొందించిన నైపుణ్యం యాప్ ద్వారా అభ్యర్థుల వివరాలు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఒక్కో అభ్యర్థికి 70 నుంచి 80 ప్రశ్నలు నమోదు చేయాల్సి రావడంతో పది నిమిషాల వరకు సమయం పడుతుందని, ప్రజలు విద్యార్హత సర్టిఫికెట్లు, ఇతర అవసరమైన సమాచారాన్ని ముందుగా సిద్ధం చేసుకుని వుంటే సర్వే త్వరితగతిన పూర్తి చేసే వీలు కలుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంజన సింహా, ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా తదితరులు పాల్గొన్నారు.



నైపుణ్య గణనపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

30 క్వింటాళ్ళ రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరుటౌన్, అక్టోబరు 3: మండల పరిధిలోని ఉప్పరపాలెం వద్ద అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ విశ్వసనీయ సమాచారం మేరకు రూరల్ ఎస్సై గండు కిరణ్, సిబ్బందితో కలిసి ఉప్పరపాలెం వద్ద తెల్లవారుజామున సోదాలు నిర్వహిస్తుంచారు. ఈ క్రమంలో ఓ లారీని ఆపి తనిఖీచేయగా, అందులో 70 బస్తాల్లో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉండటం గమనించారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు తెలిపారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న పొన్నూరు పట్టణానికి చెందిన మురళి, తాళ్లపాలెంకి చెందిన పోకల శ్రీనివాసరావు, ఉప్పరపాలెంకి చెందిన తాడిశెట్టి నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- రద్దీకి అనుగుణంగా 86 బస్సులు
- 8 నుంచే హైదరాబాద్ -గుంటూరుకు ప్రారంభం
- సాధారణ ఛార్జీలతోనే ప్రయాణం : డీపీటీవో రవికాంత్

గుంటూరు, అక్టోబరు 3: దసరా పర్వదినం పురస్కరించుకొని విభజిత గుంటూరు జిల్లా నుంచి 86 ప్రత్యేక బస్సులను సిద్ధం చేస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి రవికాంత్ తెలిపారు. జిల్లాలోని గుంటూరు-1,2 డిపోలతో పాటు మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల నుంచి దసరా పర్వదినం కోసం ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్యా, ఉద్యోగ రీత్యా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి దూర ప్రాంతాల్లో ఉంటోన్న వారు పండుగ కోసం వచ్చే వారికి ఈ నెల 8 నుంచే ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేస్తున్నారు. 8వ తేదీన 7 సర్వీసులు, 9న 16 సర్వీసులు, 10న 28 సర్వీసులు, 11న 35 ప్రత్యేక సర్వీసులను హైద రాబాద్- గుంటూరుకు వచ్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. పండుగ ముగిసిన తరువాత కూడా ప్రయాణికుల రదీ దృష్ట్యా 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు అదనపు సర్వీ సులను ఏర్పాటు చేస్తామని అన్నారు. తిరుగు ప్రయాణికుల కోసం హైదరాబాద్, చెన్నై, తిరు పతి, బెంగళూరు, విశాఖ పట్నం ప్రాంతాలకు బస్సులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. కాగా స్పెషల్ బస్సులకు సాధారణ ఛార్జీలే నిర్ణయించామని, రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123, 132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

53,641 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డుకు గురువారం 54,870 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 53,641 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 26,718 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16000	334	9000	16000
నెంబరు. 5	8500	15500	నెంబరు. 5	10000	11000
273	11300	13500	273	13000	13000
341	8000	15000	341	9500	16500
4884	12500	12500	4884	12000	13000
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9000	18600	తేజ	9500	18500
బ్యాడిగి	9000	15000	బ్యాడిగి	9500	14000
దేవనూరు డీలక్స్	10000	15000	దేవనూరు డీలక్స్	9000	16000
తెల్లకాయలు	5000	11500	తెల్లకాయలు	5000	11000

యూటీఎఫ్ ఆధ్వర్యంలో నేటి నుంచి రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు

గుంటూరు(విద్య), అక్టోబరు 3: ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపా ధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్థాపించి 50 ఏళ్లు పూరవుతున్న సంద ర్భంగా స్వర్ణోత్సవ మహా సభలను జరుపుతున్నా మని, ఇందులో భాగంగా ఇప్పటికే ఉపాధ్యాయులకు 15 అంశాలపై క్రీడలు నిర్వహించామని, రాష్ట్ర స్థాయి పోటీలు శుక్రవారం నుంచి గుంటూరులో ప్రారంభంకానున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. క్రీడా పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 4, 5 ,6 తేదీల్లో గుంటూరులోని బీఆర్ స్టేడియం, ఎన్టీఆర్ స్టేడి యంలలో జరుగుతాయని తెలిపారు. సమావేశంలో యూటీ ఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఏఎన్.కుసుమ కుమారి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జీవీ రమణ, ఎం.హనుమంతరావు, కార్యదర్శి ఎం.కళాధర్, జిల్లా అధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎన్. వెంకటేశ్వర్లు, కేఎస్ లక్ష్మణరావు తదితరులు



శిక్షణకు హాజరైన పాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు చేతిరాత శిక్షణ ప్రారంభం

గుంటూరు(విద్య),అక్టోబరు 3: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కాలిగ్రఫి టీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో చేతిరాత శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. స్థానిక గుజ్జనగుండ్లలోని చేబ్రోలు మహాలక్ష్మీ,పుల్లయ్య ఉన్నత పాఠశాలలో రెండు రోజుల ఉచిత శిక్ష ణను రెడ్‌క్రాస్ కార్యదర్శి రామచంద్రరాజు ప్రారంభించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామ్మోహన్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. గుంటూరు,కర్నూలు,నంద్యాల, ప్రకాశం,ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి 30 మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థులకు శిక్షణ యిస్తారని కోఆర్డినేటర్ తెలిపారు.

7 నుంచి వీణా అవార్డ్స్-2024 నాటక పోటీలు

తెనాలి అర్బన్, అక్టోబరు 3 : సాహిత్య సంస్థ కళల కాణాచి, వేద గంగోత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీణా అవార్డ్స్-2024 నాటక పోటీలు ఈ నెల 7న ప్రారంభం కానున్నాయి. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నాల్గవ జాతీయస్థాయి సాంఘిక పద్య నాటక, సాంఘిక నాటిక, నాటక పోటీలను నిర్వహించనున్నట్లు సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ గురువారం తెలిపారు. కొడాలి గోపాలరావు, బెల్లంకొండ రామదాసు, కన్నెగంటి నాసరయ్య వల్లూరి వెంకట్రామయ్య చౌదరి పేరిట కళాకారులకు పురస్కారాలను ప్రదానం చేస్తామన్నారు. 8న సంధ్య వెలుగు, మంత్రనగరి చిగురువేగం, నిశి, నాటికలు ప్రదర్శిస్తారు. విపంచి, రంగవీక్షణ పేరుతో రూపొందించిన పుస్తకాలను ఆవిష్కరిస్తారు. 9న అష్టమవసువు, స్వేచ్ఛ, గురి తప్పిన వేట, నేనేం చేసుకుంటాను నాటికలు, 10న యుద్ధం, మైలురాయి, ఇది రహదారి కాదు, మా ఇంటిలో మహాభారతం 11న చాందుసూరజ్, ఇది అతని సంతకం, మతమా మానవత్వమా, నా శత్రువు, 12న హరిలో రంగహరి, రుతువులేని కాలం ప్రదర్శించనున్నారు.

విచారణ కమిటీ నుంచి నలుగురు అధికారులను తొలగించాలి

- మార్కెటింగ్ కమిషనర్‌కు మన్నవ లేఖ

గుంటూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో జరిగిన అక్రమాలపై విచారణ జరిపేందుకు మార్కెటింగ్ శాఖ నియమించిన కమిటీలో నలుగురు అధికారులను తొలగించాలని ఫిర్యాదిదారు మన్నవ సుబ్బారావు ఆ శాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. ఎవరిపైన అయితే అభియోగాలు నమోదయ్యాయో వారితో కమిటీలో ఉన్న నలుగురు అధికారులకు సంబంధాలున్నాయని,విచారణ సరిగా జరిగే అవకాశం ఉండదన్నారు. సెక్రెటరీలుగా విధులు నిర్వహిస్తున్న శారద రాణి, లావణ్య ఏడీఎం ఎల్ నిత్యానందంతో పాటు గుంటూరు జిల్లాకు చెందిన మరో అధికారిని తొలగించి వారి స్థానంలో వేరే వారిని నియమించాలన్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ విచారణ తుది దశకు చేరుకొన్నందున ఈ సమయంలో మార్కెటింగ్ శాఖ ఎంక్వయిరీ చేపడితే సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నందున వారం పాటు వాయిదా వేయాలన్నారు.

దసరా సెలవులు ఇవ్వని ప్రైవేటు విద్యా సంస్థలు

గుంటూరు(విద్య),అక్టోబరు 3: రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు ఉమ్మడి జిల్లాలో ఈ నెల 2 నుంచే దసరా సెలవులు ప్రకటించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల,కళాశాలలు దసరా సెలవులు ఇచ్చేశాయి. అయితే, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు మాత్రం ఈ నెల 5 వరకు పాఠశాలలు నిర్వహిస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులకు సంక్షిప్త సమాచారాలు పంపడంతో ఏం చేయాలో తెలియక వారు ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు మాత్రం తమకు ప్రత్యేక ఉత్తర్వులు ఉన్నాయంటూ పాఠశాలలు, కళాశాలలు నిర్వహిస్తున్నాయి. విద్యాశాఖ, ఇంటర్ బోర్డు మాత్రం ఈ విషయం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేకపోవడంతో యాజమాన్యాలు మరింత రెచ్చిపోతున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలి

మాచర్ల రూరల్, అక్టోబరు 3: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కుడి కాలువ ద్వారా విడుదలవు తున్న సాగునీటిని ఇరిగేషన్ అధికారులు గురువారం పరిశీలించారు. కుడి కాలువకు ఇప్పటి వరకు 10 వేల క్యూసెక్కుల నీటిని పెంచారు. అనంతరం కుడికాలువ గేజ్ రీడింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ గేట్స్ డీఈ మురళీధర్ మాట్లాడుతూ సాగర్ జలాశయానికి ఎగువ నుంచి భారీగా వరద వస్తుండడంతో కుడి కాలువకు నిరంతరాయంగా నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెయిన్ కెనాల్ మానిటరింగ్ ఏఈఈ వెంకట సుబ్బయ్య, సాగర్ ప్రాజెక్ట్ గేట్స్ ఏఈఈ అనితశ్రీ పాల్గొన్నారు.



కుడి కాలువకు విడుదలవుతున్న నీటిని పరిశీలిస్తున్న అధికారులు

నాగార్జున సాగర్ నీటి సమాచారం

సాగర్ జలాశయం నీటిమట్టం గురువారం నాటికి 588.30 అడుగులు ఉంది. ఇది 306.98 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,867 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 9076 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,191 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్ ఫ్లో వాటర్‌గా 52,134 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 52,134 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

సీపీడీసీఎల్ పల్నాడు సర్కిల్ ఎస్ఏవోగా సుబ్బారావు

- గుంటూరు సర్కిల్ ఎస్ఏవోగా రామిరెడ్డి కొనసాగింపు

గుంటూరు, అక్టోబరు 3: ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్‌కార్పొరేషన్ లిమిటెడ్ (సీపీడీసీఎల్)లో బదిలీల పర్వం కొనసాగుతోంది. కొత్తగా ఏర్పాటు చేసిన పల్నాడు సర్కిల్‌కు సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (ఎస్ఏవో)గా కే సుబ్బారావును నియమించారు. ప్రస్తుతం ఒంగోలు సర్కిల్ ఎస్ఏవోగా వ్యవహరిస్తున్న ఆయన్ను పల్నాడు సర్కిల్‌కు బదిలీ చేశారు. ఇక ప్రస్తుతం గుంటూరు సర్కిల్ ఎస్ఏవోగా వ్యవహరిస్తున్న పాశం రామిరెడ్డినే తిరిగి ఇక్కడే కొనసాగేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం రాత్రి సీపీడీసీఎల్ సీఎండీ పి.రవి ఉత్తర్వులు వెలువరించారు. అయితే, కొత్తగా ఏర్పడిన బాపట్ల సర్కిల్ ఏవో పోస్టును కూడా భర్తీ చేయాల్సి ఉంది.

అనుమానాస్పద మృతి కేసు ప్రియుడితో కలిసి భర్త హత్య

మాచర్లరూరల్, అక్టోబరు 3: గత నెల 30న మండలంలోని తాళ్లపల్లికి చెం దిన ఓర్సు శివ అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై మృతుని తల్లి రమణమ్మ ఫిర్యాదుతో విజయపురిసౌత్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా గురువారం విజయపురిసౌత్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. శివ భార్య గాయత్రి, అదే గ్రామానికి చెందిన దేరంగుల అమ్మోరయ్య మధ్య కొంత కాలంగా వివాహేతర సంబంధం ఉంది. గత నెల 29న అర్ధరాత్రి సమయంలో తన భర్త ఇంట్లో ఉన్నప్పటికీ, గాయత్రి, అమ్మోరయ్యలు సన్నిహితంగా మెలిగారు. అలికిడికి నిద్రలేచిన శివ, వారిద్దరిని చూశాడు. గాయత్రి, అమ్మోరయ్యతో శివ గొడవపడ్డాడు. గాయత్రి, అమ్మోరయ్యలు కలిసి శివను ఇంట్లోకి లాక్కెళ్లి మంచంపై పడవేశారు. అతని ముఖంపై దిండును అదిమిపెట్టి ఉంచి, ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. ప్రియుడు సచివాలయ ఉద్యోగి. శివ, గాయత్రికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఒకరి వయసు ఏడేళ్లు, మరొకరి వయసు నాలుగేళ్లు. గాయత్రి, అమ్మోరయ్యలు తాళ్లపల్లి వీఆర్వో ఆర్.నాగేశ్వరరావు వద్ద సరెండర్ కాగా, ఆయన పోలీసులకు తెలిపారు. నిందితులను మాచర్ల కోర్టులో హాజరుపరచగా వారికి న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఏఎస్ఐ సోమ్లానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు


సీజ్ చేసిన పురుగుమందులతో విజిలెన్స్ అధికారులు

గురజాలటౌన్, అక్టోబరు 3: మండలంలోని గోగులపాడులో గల శ్రీనివాస ఫర్టిలైజర్స్ దుకాణంలో గురువారం గుంటూరుకు చెందిన రీజనల్ విజిలెన్స్ ఎన్ ఫోర్స్‌మెంట్ అధికారులు మండల వ్యవసాయాధికారి సంధ్యారాణితో కలిసి దాడులు నిర్వహించారు. దుకాణంలో రాష్ట్రంలో నిషేధించబడిన కలుపుమందు గ్లైసిల్ 6 కేజీలు (రూ.10,800), గడువు ముగిసిన పురుగుమందులు రూ.61,889ల విలువైన సరుకును సీజ్ చేశారు. అలాగే ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు, ఇతర పత్రాలు సమర్పించని సుమారు రూ.24,20,167ల బయోమందుల అమ్మకాలను నిలిపివేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కొమ్మాలపాటి చంద్రశేఖర్, విజిలెన్స్ ఏవో రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమాధుల చుట్టూ ప్రహరీ నిర్మించాలి

● గ్రామసభలో ఎస్సీకాలనీ వాసుల వినతి


సర్పంచ్ సరస్వతిబాయికి వినతిపత్రం అందిస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

కారంపూడి, అక్టోబరు 3: ఎస్సీ వర్గీయుల సమాధుల చుట్టూ ప్రహరీ నిర్మించాలని ఎస్సీ కాలనీ వాసులు కోరారు. కారంపూడి సచివాలయంలో గురువారం జరిగిన గ్రామసభలో సర్పంచ్ సరస్వతీబాయి, కార్యదర్శి కసిన్యానాయక్‌లకు ఎస్సీ కాలనీవాసులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టీడీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ కాల్వ పేరయ్య మాట్లాడుతూ సమాధుల ప్రదేశం ఆక్రమణలకు గురవుతోందని, అధికారులకు విన్నవించుకున్నా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో సమాధుల ప్రదేశాలు ఆక్రమణలకు గురవుతున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. కనీసంగా ప్రహరీ నిర్మించడానికి కూడా నాయకులు గానీ అధికారులు గానీ ముందుకు రాలేదన్నారు. త్వరగా ప్రహరీ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, మాజీ అధ్యక్షుడు తండా మస్తాన్‌జాని, ఆర్యవైశ్య నేతలు ఎస్‌పీఆర్ కృష్ణ, కర్నాటి మహేష్, కాసుల గోవిందు, జడ్పీహెచ్ఎస్ ఎస్ఎంసీ చైర్మన్ బాలూనాయక్, కాపు సంఘ నేతలు తోట నరసింహారావు, మిరియాల వెంకటేశ్వర్లు, జక్కా వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల సబ్‌డివిజన్ పరిధిలో 16 సాగునీటి సంఘాలు

● మల్లవరం ఏఈఈ శ్రీనివాసరెడ్డి

రెంటచింతల, అక్టోబరు 3: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని అందులో భాగంగా మాచర్ల సబ్ డివిజన్ పరిధిలో 16 సాగునీటి సంఘాలున్నట్లు మల్లవరం ఏఈఈ కె.శ్రీనివాసరెడ్డి చెప్పారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2015లో చివరిసారిగా ఎన్నికలు నిర్వహించారన్నారు. మాచర్ల సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న సాగునీటి సంఘాలు వివరాలిలా ఉన్నాయి. మేజర్ల కింద 16 డబ్ల్యూయూఏ (వాటర్ యూజర్ అసోసియేషన్) ఉన్నాయి. తాళ్లపల్లి, కంభంపాడు 1, తుమ్మకోట, పశర్లపాడు, కంభంపాడు 2, పాలువాయి, రెంటాల సంఘాలు డీసీ 1 పరిధిలో ఉన్నాయి. డీసీ 2 (డిస్ట్రిబ్యూటరీ కెనాల్) పరిధిలో మాడుగుల 1,రెంటచింతల 1,గురజాల 1,మిట్టగుడిపాడు,గొట్టిముక్కల,మాడుగుల 2, గురజాల 2 గంగవరం 1, దైద సంఘాలున్నట్లు అధికారులుపేర్కొన్నారు. ఒక సంఘంలో అధ్యక్షులు, 6గురు సభ్యులుంటారు. ఓటరుగా నమోదు కావడానికి అటు రెవెన్యూ అధికారులు, ఇటు ఇరిగేషన్ అధికారుల వద్ద పేరు నమోదు చేసుకోవచ్చన్నారు.

పలువురికి ఎమ్మెల్యే యరపతినేని పరామర్శ

పిడుగురాళ్ల, అక్టోబరు 3: ఇటీవల పట్టణంలో పలువురు పార్టీ శ్రేణులు అకాల మరణం చెందగా వారి కుటుంబాలను గురువారం గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పరామర్శించారు. వడ్డవల్లి మధుసూదనరావు, కోట వెంకట సుబ్బారావు, కరాలపాటి వినోదకుమారి, సాతర్ల రమణ, చిమటా నాగేంద్రబాబు కుటుంబసభ్యులను ఎమ్మెల్యే యరపతినేని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కనిగిరి శ్రీను, వడ్డవల్లి సాంబశివరావు, ఎల్‌వీఆర్, వీవీ నాగేశ్వరరావు, కోట హరి, పిల్లి చెన్నారావు, గుదె నాగ సతీష్, పర్వతనేని రామారావు, కామిశెట్టి రమేష్ తదితరులున్నారు.

మట్టి ఖర్చులకు రూ. 10 వేల ఆర్థికసాయం

మాచర్లటౌన్, అక్టోబరు 3: మాచర్ల పట్టణానికి చెందిన షేక్ రఫి అనారోగ్య కారణాలతో గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి రూ. 10 వేలను మట్టి ఖర్చుల నిమిత్తం పంపించారు. ఈ నగదును టీడీపీ నేతలు మృతుని కుటుంబసభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో అన్వర్, రసూల్, నాగూర్‌బాషా, మొహదీద్దన్ ఖాజా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో తాళ్లపల్లి సర్పంచ్ బ్రహ్మానాయుడు మృతి

మాచర్ల రూరల్, అక్టోబరు 3: మండలంలోని తాళ్లపల్లి గ్రామ సర్పంచ్, టీడీపీ నేత పసుపులేటి బ్రహ్మానాయుడు గుండెపోటుతో మృతిచెందాడు. గురువారం సాయంత్రం సమయంలో స్వల్ప అస్వస్థతకు గురి కాగా కుటుంబసభ్యులు మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి గుంటూరుకు రిఫర్ చేశారు. గుంటూరు వెళ్తుండగా మార్గమధ్యంలో తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి సంతాపాన్ని వ్యక్తం చేశారు. బ్రహ్మానాయుడు మృతి పార్టీకి తీరనిలోటన్నారు.

మాచర్ల నుంచి చెన్నైకి సూపర్ లగ్జరీ బస్సు సర్వీసు

● ఆర్టీసీ డీఎం పిచ్చయ్య

మాచర్లటౌన్, అక్టోబరు 3: మాచర్ల ఆర్టీసీ డిపో నుంచి చెన్నైకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం రెంటాల పిచ్చయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ బస్సు సర్వీసును శుక్రవారం ఉదయం 11 గంటలకు మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ బస్సు ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు మాచర్ల ఆర్టీసీ డిపో నుంచి బయలుదేరి కారంపూడి, వినుకొండ, పొదిలి, ఒంగోలు, నెల్లూరు, సుళ్లూరుపేట మీదుగా చెన్నైకి ఉదయం 5 గంటలకు చేరుకుంటుందన్నారు. అదే రోజు సాయంత్రం 6:30 గంటలకు చెన్నై నుంచి బయలుదేరి అదే మార్గం ద్వారా ఉదయం 5:30 గంటలకు మాచర్లకు చేరుకుంటుందన్నారు. ఈ అవకాశాన్ని మాచర్ల, గురజాల నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దొడ్లేరు - బెల్లంకొండ రహదారికి త్వరలో మరమ్మతులు

క్రోసూరు, అక్టోబరు 3: దొడ్లేరు నుంచి బెల్లంకొండ వరకు రహదారికి తాత్కాలిక మరమ్మతులు త్వరలో చేపడతామని రోడ్లు, భవనాలశాఖ జిల్లా అధికారులు ప్రకటన విడుదల చేశారు. ఈనెల 30వ తేదీన అధ్వానంగా దొడ్లేరు, బెల్లంకొండ రహదారి శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు జిల్లా అధికారులు స్పందించారు. ఈ రహదారి విస్తరణ పనులు, నిర్మాణ పనులు దొడ్లేరు వరకు చురుగ్గా సాగుతున్నాయని, దొడ్లేరు నుంచి బెల్లంకొండ వరకు విస్తరణ పనులతో పాటు తాత్కాలిక మరమ్మతులను చేపడతామని వారు ప్రకటనలో పేర్కొన్నారు.

దశాబ్దా కాలానికి పైగా రోడ్డు లేక ఇబ్బందులు

పెదకూరపాడు, అక్టోబరు 3 : దశాబ్ద కాలానికి పైగా రోడ్డు సక్రమంగా లేకపోవటంతో జలాలపురం, కంభంపాడు, పరస గ్రామాల ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారని టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ అన్నారు. మండలంలోని జలాలపురంలో స్థానిక గ్రామం నుంచి కంభంపాడు వెళ్ళే లింకు రోడ్డు పనులను కొబ్బరి కాయ కొట్టి రూ.1.50 కోట్లతో రమేష్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయించి మూడు గ్రామాల ప్రజల కలను నెరవేర్చారన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ వాణీనాథ్, ఎంపీడీవో రామకృష్ణ, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, పాటిబండ్ల శివమ్మ, టీడీపీ మండల నేతలు తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 3: పులిచింతల ప్రాజెక్టులో గురువారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 31,247 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 26,971 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుండగా దీనిలో 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు. ఒక గేటును ఒక మీటరుకు ఎత్తి దిగువకు నీరు విడుదల చేస్తున్నారు.

పంట కాల్వల మరమ్మతులకు యరపతినేని ముందడుగు

● రాష్ట్రంలోనే మొదటగా గురజాలలో రైతుల కష్టాలకు చెక్

● అధికారులు, రైతులతో సమీక్ష.. రెండు రోజుల్లో కార్యాచరణ


జలవనరులశాఖ సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, దాచేపల్లి, అక్టోబరు 3: పల్నాడులో ఐదేళ్లుగా మాగాణి భూములన్నీ మెట్టభూములయ్యాయి. ఇందుకు కారణం వైసీపీ ప్రభుత్వ హయాంలో పంట కాల్వలు మరమ్మతులకు నోచుకోక కాల్వ పైభాగంలో వున్న కొంత భూములకే నీరందటం, మిగిలిన భూములకు సాగునీరందక పోవడంతో రైతులు తమ సేద్యపు మాగాణి భూముల్లో వాణిజ్య పంటలు సాగు చేశారు. ఐదేళ్లలో పనులు చేయకుండానే కోట్ల రూపాయల బిల్లులను వైసీపీ నేతలు సిండికేట్‌గా దోచుకోవడంతో రైతులకు సాగునీటి కష్టాలే ఎదురయ్యాయి. గురజాల నియోజకవర్గంలో రైతులు ఐదేళ్లుగా ఎదుర్కొంటున్న సాగునీటి కష్టాలను తెలుసుకున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తక్షణమే ఓ అడుగు ముందుకేశారు. రాష్ట్రంలోనే గురజాల ఎమ్మెల్యే మొదటగా పంట కాల్వల దుస్థితిపై స్పందించి రైతులు, అధికారులతో స్వయంగా సమీక్ష నిర్వహించి రైతుల కష్టాలను తొలగించేందుకు శ్రీకారం చుట్టారు. గురువారం దాచేపల్లి వేదికగా రైతులు, అధికారులతో సమీక్ష నిర్వహించి ఎక్కడెక్కడ పంట కాల్వలు మరమ్మతులు తక్షణమే అవసరమో వాటిని గుర్తించి రెండు రోజుల్లో కార్యాచరణ అమల్లోకి తీసుకొచ్చి పంట కాల్వల మరమ్మతులు పూర్తిచేసి రైతుల చివరి భూములకు సాగునీరు అందించే లక్ష్యంగా యుద్ధప్రాతిపదికన పనులు చేయాలని యరపతినేని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో పల్నాడులోని గురజాల నియోజకవర్గంలో తంగెడ, ఆకురాజుపల్లి, రామాపురం, దైద మేజర్లతో పాటు మరికొన్ని మేజర్, మైనర్ కాల్వల పరిధిలో వేలాది ఎకరాల సాగుభూములకు నీరందక భూములన్నీ గత ఏడాది ఖాళీగా ఉన్నాయి. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసినప్పటికీ గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో మేజర్, మైనర్ కాల్వలు పూడికతీత లేకపోవడం, చివరి భూములకు సాగునీరు అందటం కష్టంగా ఉందన్న విషయం యరపతినేని కొద్ది రోజుల క్రితం వీరాపురం వద్ద మేజర్ కాల్వను పరిశీలించారు. రైతుల కష్టాలను గుర్తించి చివరి భూములకు సాగునీరు అందించేందుకు చేస్తున్న కృషికి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుంది : జంగా

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ అధికారులు బాధ్యతగా వ్యవహరించి రైతుల అభివృద్ధికి సహకరించాలన్నారు. గత పాలకులు నిధులున్నా అభివృద్ధి చేయకపోవడంతో నేడు రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాల్వలు బాగుంటేనే సాగునీరు అందుతుందని, సాగర్ డ్యామ్‌లో నీరున్నా కాల్వలు బాగలేకపోతే ప్రయోజనం ఏమీ ఉండదని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కూటమి నేతలు పులుకూరి కాంతారావు, తంగెళ్ల శ్రీనివాసరావు, బెల్లంకొండ భద్రి, నర్రా పుల్లయ్య, వేముల వినోద్‌రెడ్డి, అక్కినపల్లి బాలయ్య, పగడాల భాస్కరరావు, అంబటి శేష గిరిరావు, నెల్లూరి రామకోటయ్య, పురంశెట్టి పరంజ్యోతి, గుదె సైదయ్య, కూరాకుల నాగే శ్వరరావు, బొమ్మిరెడ్డి సత్యం, సొసైటీ నారాయణ, డాక్టర్ కర్నాటి వరలక్ష్మీ, ఇరిగేషన్ ఈఈ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వరికపూడిశెల ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి


సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, అక్టోబరు 3: నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలంలో వరికపూడిశెల ప్రాజెక్ట్ త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందుకు తగిన ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదిక అందించాలని కలెక్టర్ అరుణ్‌బాబును ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. గురువారం నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి పనులపై నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌తో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, మౌలిక వసతులపై చర్చించారు. ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, నష్టాన్ని అంచనా వేసి ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు బ్రహ్మానందరెడ్డి, జీవీ ఆంజనేయులు, కన్నా లక్ష్మీనారాయణ, అరవిందబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

● మొదటిరోజు బాల త్రిపురసుందరిదేవిగా అమ్మవారు


మాచర్లలో బాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు


కారంపూడిలో వనబాలగా వాసవీ అమ్మవారు


బాలాత్రిపురసుందరిగా దాచేపల్లిలోని అంకమ్మతల్లి

మాచర్లటౌన్, అక్టోబరు 3: పట్టణంలో ఉన్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి శ్రీదేవి శరన్నవరాత్రుల సందర్భంగా గురువారం బాల త్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.


కారంపూడి, అక్టోబరు 3: పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని వనబాలగా, అంకాళమ్మ అమ్మవారిని బాల త్రిపురసుందరీదేవిగా అలంకరించారు. భక్తులకు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయాల్లో కుంకుమ పూజలు జరిపారు.


రెంటచింతల, అక్టోబరు 3: మండలంలోని ఆలయాలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. వాసవీకన్యకాపరమేశ్వరీ జంక్షన్‌లోని కనకదుర్గ అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. సత్రశాల గంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ఉత్సవాలు ప్రారంభించారు


సత్తెనపల్లి, అక్టోబరు 3: పట్టణంలోని కొత్తపేట భావనా రుషినగర్‌లో గణేష్ యువసేన ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారిని బాలాత్రిపుర సుందరిదేవిగా అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని సందర్శించి కుంకుమ పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వెంకటపతి కాలనీలో బాలాత్రిపుర సుందరీదేవిగా నీలంపాటి లక్ష్మి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

నకరికల్లు, అక్టోబరు 3: చేజర్లలో గంగాభ్రమరాంబ పార్వతీబాల అలంకారంలో దర్శనమిచ్చారు. కుంకలగుంటలో భద్రకాళి, నకరికల్లు, గుండ్లపల్లిలో వాసవీ కన్యకాపర మేశ్వరి, నరసింగపాడులో అన్నపూర్ణాదేవి, గంగా అన్నపూర్ణలు భక్తులకు బాల అలంకారంలో దర్శనమిచ్చారు.

అచ్చంపేట, అక్టోబరు 3: అచ్చంపేటలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఉదయం 6 గంటలకు మంగళ వాయిద్యం, మంగళ తోరణం, సుప్రభాతం, అనంతరం 10 గంటలకు కలశస్థాపన, 11 గంటలకు పూజా కార్యక్ర మాలు మొదలై ఆర్యవైశ్య మహిళా విభాగం వారిచే శ్రీలలిత సహస్రనామం స్తోత్ర పారాయణం జరిగింది. అనంతరం బతుకమ్మ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా..రూ.60వేల నోట్లతో అలంకరించారు.


అచ్చంపేటలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు


క్రోసూరులో వాసవీ అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా


బాల అలంకారంలో చేజర్ల పార్వతీ అమ్మవారు

క్రోసూరు, అక్టోబరు 3 : క్రోసూరులోని వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో వాసవీ అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు.

బెల్లంకొండ, అక్టోబరు 3: బెల్లంకొండలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజున గణపతి పూజ, పుణ్యాహ వచనం, కలశ స్థాపనతో ఘనంగా ఉత్స వాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు మహాలక్ష్మీదేవి బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు.

పెదకూరపాడు, అక్టోబరు 3 : మండలంలోని పలు గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకొని పలు దేవాలయాల్లో అన్నపూర్ణాదేవి, బాల త్రిపురసుందరీదేవిగా అమ్మవార్లు భక్తులకు దర్శన మిచ్చారు. 75 తాళ్ళూరులోని అన్నపూర్ణ విఘ్నేశ్వర స్వామి దేవాలయం, పెదకూరపాడులోని నాగమల్లేశ్వర స్వామి దేవాలయంలో అలంకరించిన అమ్మవార్లకు శ్రీలలిత సహస్రనామాలతో కుంకుమార్చనలను నిర్వహించారు.

పిడుగురాళ్ల, అక్టోబరు 3: దసరా నవరాత్రులు పురస్కరించుకొని పట్టణంలోని పలు దేవాలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు. మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, దేవస్థానం అధ్యక్షుడు కొత్త రఘురామయ్యతో పాటు పలువురు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. కనకదుర్గ అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించారు.

దాచేపల్లి, అక్టోబరు 3: దాచేపల్లిలోని వీర్లఅంకమ్మతల్లి దేవాలయంలో బాలాత్రిపురసుందరిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలు కుంకుమపూజలు నిర్వహించారు.

కుల బహిష్కరణలు ఆపండి

అచ్చంపేట, అక్టోబరు 3: మండలంలోని చెరుకుంపాలెంలో బిక్షగుంట్ల కులం లో కుల బహిష్కరణలు జరుగుతున్నాయని, వీటిని తక్షణమే ఆపేందుకు చర్యలు చేపట్టాలని అదే కులానికి చెందిన కత్తుల గోపీ కృష్ణారెడ్డి, అతని భార్య కే నాగ సంధ్య గ్రామసర్పంచ్ పోట్ల శ్రీనివాసరావుకు గురువారం వినతిపత్రం అందించారు. చెరుకుంపాలెం గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో అందజేశారు. ఈ కులంలో కుల బహిష్కరణలు కొనసాగుతున్నాయని, కొందరు కుల పెద్దలు వారి ఇష్టానుసారం బహిష్కరిస్తున్నారని, కులాంతర వివాహాలు చేసుకున్న వారిపై, వారి బంధువులపై కూడా కుల బహిష్కరణలు కొనసాగిస్తున్నారని వినతిపత్రంలో తెలిపారు.

రెండు ఆటోలు ఢీ.. నలుగురికి గాయాలు

సత్తెనపల్లి రూరల్, అక్టోబరు 3: రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొనటంతో నలుగురికి గాయాలైన ఘటన మండలంలోని పాకాలపాడు వద్ద గురువారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సత్తెనపల్లి నుంచి క్రోసూరు వైపు, రెంటపాళ్ళ నుంచి సత్తెనపల్లి ప్రయాణికులతో వస్తున్న ఆటోలు పాకాలపాడు వద్దకు రాగానే ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో అజయ్‌కుమార్, ఖాజావలి, కుమారి, గోవర్దనలకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రమాద ఘటనపై విచారణ జరుపుతున్నట్టు రూరల్ పోలీసులు తెలిపారు.

నరసింగపాడు, త్రిపురాపురంలో పొలం పిలుస్తుంది

నకరికల్లు, అక్టోబరు 3: మండలంలోని నరసింగపాడు, త్రిపురాపురం గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో కే దేవదాసు, వీఏఏలు సుభానీ, ప్రభాకర్, వీఆర్‌వో మార్క్, వెటర్నరీ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.

వన్య ప్రాణుల వారోత్సవాలు ప్రారంభం

అచ్చంపేట, అక్టోబరు 3: అచ్చంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వన్యప్రాణుల వారోత్సవాలు నిర్వహించినట్టు డీఆర్‌వో కుసుమకుమారి తెలిపారు. వన్య ప్రాణుల వారోత్సవాలు ఈనెల 8వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ప్రకృతిని కాపాడుకుంటూ ముందుకు పోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు.

ఛండీ హోమం

సత్తెనపల్లి, అక్టోబరు 3: పట్టణంలోని లక్ష్మీతిరుపతమ్మ తల్లి దేవాలయంలో నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు ఆధ్వర్యంలో ఛండీ హోమాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. పవన్‌కళ్యాణ్ దీక్షకు సంఘీభావంగా ఈ హోమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు జన సైనికులు, భక్తులు పాల్గొన్నారు.

నకరికల్లు ఎంపీడీవోగా కాశయ్య


గోరంట్ల కాశయ్య

నకరికల్లు, అక్టోబరు 3: నకరికల్లు ఎంపీడీవోగా గోరంట్ల కాశయ్య గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా కాశయ్య పిడుగురాళ్ళ నుంచి నకరికల్లుకు బదిలీపై రాగా ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన బీ శ్రీనివాసరెడ్డి సత్తెనపల్లికి బదిలీపై వెళ్లారు.

జిల్లా స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

రెంటచింతల, అక్టోబరు 3: చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో జెట్టిపాలెం మోడల్ స్కూల్‌కు చెందిన పి.హారిక, కె.బాలగౌతమ్, జి.జ్యోతిలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.పాపయ్య చెప్పారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 16న నరసరావుపేటలో పోటీలుంటాయన్నారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో జి.విద్యాసాగర్, కె.కుమార్, టీ అలేఖ్య, ఎస్‌కే జబీనా తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు అధిక మేలు

క్రోసూరు, అక్టోబరు 3: ప్రకృతి వ్యవసాయంలో రైతులకు అన్ని విధాలా మేలు జరుగుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ శిక్షకుడు టీ సైదయ్య అన్నారు. ప్రకృతి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం దొడ్లేరులోను, అనంతవరంలోను పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. దొడ్లేరులో జరిగిన కార్యక్రమంలో సైదయ్య మాట్లాడుతూ వరిలో అగ్గి తెగులు ఆశించే అవకాశం ఉందని, రైతులు వందల లీటర్ల నీటికి 20లీటర్ల జీవామృతాన్ని, ఆరు లీటర్ల పులిసిన మజ్జిగను కలిపి పిచికారి చేస్తే తెగుళ్ళు నివారించవచ్చన్నారు. స్కూల్ విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజెప్పారు.

రైతులకు అన్యాయం జరిగేలా వ్యవహరించవద్దు

● వ్యవసాయ అధికారులతో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, అక్టోబరు 3 : రైతులకు న్యాయం చేసే విధంగా వ్యవసాయ అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు అన్యాయం జరిగేలా ఎవ్వరూ వ్యవహరించవద్దన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా పని చేస్తూ ప్రభుత్వ పథకాలను అర్హులైన రైతులకు అందించాలన్నారు. సీఎం చంద్రబాబునాయుడు వ్యవసాయాన్ని రైతులకు లాభసాటిగా చేసేందుకు అనేక పథకాలను ప్రవేశ పెడుతున్నారన్నారు. ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలన్నారు. ఈకేవైసీ, మట్టి నమూనాల సేకరణ, పంట సాగుదారుని హక్కుపత్రాల నమోదు ప్రక్రియను నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు కోసం దరఖాస్తులు చేయించండి

క్రోసూరు, అక్టోబరు 3: పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో ఓటు కోసం గ్రాడ్యుయేట్స్‌తో విరివిగా దరఖాస్తులు చేయించాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. గురువారం గుంటూరులోని ఆయన కార్యాలయంలో క్రోసూరు మండలానికి చెందిన టీడీపీ నాయకులతో ఆయన మాట్లాడారు. డిగ్రీ చదివిన ప్రతి ఒక్కరి చేత ఓటు నమోదు చేయించేందుకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. గ్రామ స్థాయిలో సభ్యత్వాన్ని పెంచి పార్టీ బలోపేతానికి తోడ్పడాలని, ప్రతి నాయకుడు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. క్రోసూరు మండల నాయకులు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు నలజాల సదాశివరావు, తోక వెంకటరావు, గుడిపాడు బాషా, కొండవీటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.50 లక్షల విలువైన పనులకు ఆమోదం


మండలపరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జైభూన్ బీ

సత్తెనపల్లి రూరల్, అక్టోబరు 3: మండలపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్లో ఎంపీపీ షేక్ యలవర్తిపాటి జైభూన్ బీ అధ్యక్షతన గురువారం జరిగింది. సమావేశంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.50 లక్షలతో కొన్ని గ్రామాల్లో సీసీ డ్రెయిన్‌లు, కల్వర్టులు, వాటర్ ప్లాంట్ షెడ్ల నిర్మాణం, హిందూ శ్మశాన వాటికల్లో సౌకర్యాల మెరుగు పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి తీర్మానించారు. పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. ముందుగా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతి గురించి, తమ శాఖల ద్వారా అమలయ్యే పథకాల గురించి సమావేశంలో నివేదించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జైభూన్ బీ మాట్లాడుతూ అందరి సహకారంతో మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుందామని, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిద్దామన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమన్నారు. సమావేశంలో భట్లూరు, నందిగామ, లక్ష్మీపురం గ్రామాల సర్పంచులు ఈదర రామారావు, బలిజే పల్లి రమాదేవి, శ్రీనివాసరావు, డీఎల్‌డీవో రాజగోపాల్, ఎంపీడీవో సత్యనారాయణ, ఈవోపీఆర్‌డీ దయాసాగర్, ఏవో శ్రీధర్‌రెడ్డి, ఫణిదం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రదీప్, ఎంఈవో శ్రీనివాసరావు, పంచాయతీరాజ్, హౌసింగ్ ఏఈలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్కేటింగ్‌లో క్రోసూరు విద్యార్థుల ప్రతిభ


బహుమతులు, మెడల్స్ గెలుచుకున్న క్రోసూరు విద్యార్థులు

క్రోసూరు, అక్టోబరు 3: రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో క్రోసూర్ సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీ రజిత గురువార తెలియజేశారు. ఒంగోల్లో జరిగిన ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు 15 బహుమతులు గెలుచుకున్నట్టు తెలిపారు. యూత్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో అండర్ -- 11 విభాగంలో మన్నెం జ్ఞానేశ్వర్ వంద మీటర్లలో ప్రథమ, రెండు వందల మీటర్లలో ప్రథమ, నాలుగు వందల మీటర్లలో ప్రథమ, ఆరు వందల మీటర్లలో తృతీయ, ఎనిమిది వందల మీటర్లు ద్వితీయ బహుమతి గెలుచుకున్నట్టు చెప్పారు. అండర్ - 17 విభాగంలో ఆత్మకూరి నరేంద్ర ఆరు వందల మీటర్లలో ద్వితీయ, ఎనిమిది వందల మీటర్లలో ద్వితీయ, సుంకిశాల జాకీచాన్ ఆరు వందల మీటర్లలో తృతీయ, 800 మీటర్లలో తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. అండర్ - 14 విభాగంలో సుంకిశాల జాహ్నవి రెండు వందల మీటర్లు ద్వితీయ, నాలుగు వందల మీటర్లు తృతీయ, అండర్ 11 విభాగంలో గంజిమాల శైల రెండు వందల మీటర్లు ద్వితీయ, ఆరు వందల మీటర్లు తృతీయ, కే శాన్విఫ్లోరెన్స్ ఆరు వందల మీటర్లు ద్వితీయ, అండర్- 7 విభాగంలో మద్ది లలితాంబ ద్వితీయ స్థానాల్లో నిలిచి బహుమతులు, మెడల్స్, ప్రశంసాపత్రాలు పొందారని తెలియజేశారు. విశేష ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థులను పాఠశాల యాజమాన్యంతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ఎరువుల యాజమాన్యంపై రైతులకు శిక్షణ

మాచవరం, అక్టోబరు 3: మండలంలోని రేగులగడ్డ, చెన్నాయపాలెం గ్రామాల్లో గురువారం ఎరువుల యాజమాన్యంపై రైతులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌సీ వ్యవసాయ అధికారి ప్రవీణ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రత్తి పంటలో యాజమాన్యం, ఎరువుల యాజమాన్యంపై రైతులకు సూచనలు, సలహాలు తెలియజేశారు. పంటలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి, ఎరువుల అధిక వాడకం గురించి రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఏవో కే రామమ్మ, వీఏఏలు పాల్గొన్నారు.

మద్యం షాపులకు ఆఫ్‌లైన్ టెండర్లకు ఆహ్వానం

పెదకూరపాడు, అక్టోబరు 3 : పెదకూరపాడు, అమరావతి మండలాల పరిధిలోని మద్యం షాపులకు ప్రభుత్వ నూతన మద్యం పాలసీ విధానం ద్వారా ఎక్సైజ్ స్టేషన్‌లో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సీఐ వీ శ్రీనివాసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎన్ కోటేశ్వరరావులు తెలిపారు. పెదకూరపాడులో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పెదకూరపాడు మండలంలో ఐదు షాపులు, అమరావతి మండలంలో ఐదు షాపులకు ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పెదకూరపాడు ఎక్సైజ్‌స్టేషన్‌లో తీసుకుంటారని, ఆన్‌లైన్‌లో ఎక్కడినుంచైనా అప్లికేషన్ పెట్టుకోవచ్చన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

సత్తెనపల్లి, అక్టోబరు 3: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చే నూతన చట్టం వల్ల న్యాయవాదులకు నష్టం వాటిల్లుతుందని నిరసన వ్యక్తం చేస్తూ గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో విధులను బహిష్కరించారు. కార్యక్రమంలో కే అనీల్‌కు మార్, పాటిబండ్ల రవి, ఎం వెంకటేశ్వరరావు, నాగూర్‌బాబు, కల్లం వీరభాస్కర్‌రెడ్డి, పూజల వెంకటకోటయ్య, బత్తుల ఆది నారాయణ, దివ్వెల శ్రీను, ఎంవీ చలపతిరావు, నరిచేటి వేణు గోపాల్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష

నరసరావుపేట రూరల్, అక్టోబరు 3: పల్నాడు జిల్లాలో 2024-25 సంవత్సరానికి పత్తి కొనుగోలు కేంద్రాల ముందస్తు ఏర్పాట్లుకు సంబంధించి జిల్లాస్థాయి కమిటీ సభ్యులతో, ఏఎంసీ కార్యదర్శులతో జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పల్నాడు జిల్లాలో పత్తి సాగుచేస్తున్న రైతులందరూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను 100శాతం పూర్తిచేయాలని కోరారు. గుర్తించిన కొనుగోలు కేంద్రాలలో తూకాలు తనిఖీ చేయాలని, కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న సేఫ్టీ మెజర్‌మెంట్స్ తనిఖీలు చేయాలని, పత్తి కొనుగోళ్ళ గురించి జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రచారం చేయాలని సంబంధిత శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. రైతులు లూజు పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకునివచ్చేలా ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. కార్యక్రమంల్లో, జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి కే.సూర్య ప్రకాష్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, అదనపు జిల్లా ఎస్పీ జేవీ సంతోష్, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి ఎన్.శివనాగేశ్వరరావు, జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎస్.శ్రీధర్, ఏఎంసీల కార్యదర్శులు, సీసీఐ బయ్యర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ఇనుమెళ్ళ (ఈపూరు): ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని ఇనుమెళ్ళ గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుంటుపల్లి పిచ్చయ్య(46) రోడ్డుపై వస్తుండగా నర్సరావుపేట నుంచి బొమ్మరాజుపల్లి వెళ్తున్న బస్సు ఢీకొంది. ప్రమాదంలో పిచ్చయ్యకు గాయాలయ్యాయి. గాయపడిన పిచ్చయ్యను నర్సరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా మృతిచెందాడు. పిడుగురాళ్ళ మండలం జానపాడు గ్రామానికి చెందిన పిచ్చయ్య మూడు సంవత్సరాల క్రితం ఇనుమెళ్ళ వచ్చి పనులు చేసుకొంటూ ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు తెలిపారు.



దీక్షలలో కూర్చున్న రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

నరసరావుపేటలో విశాఖ ఉక్కు పరిరక్షణ దీక్షలు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 3: నరసరావుపేట గాంధీ పార్కు వద్ద నిర్వహిస్తున్న విశాఖ ఉక్కు పరిరక్షణ దీక్షలు గురువారం మూడోరోజుకు చేరాయి. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, సొంత గనులు కేటాయించాలని, తొలగించిన కార్మికులను వెంటనే ఉద్యోగాలలో చేర్చుకోవాలని, భూములు ఇచ్చిన రైతుల బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ గోపాలరావు, జిల్లా అధ్యక్షుడు తాళ్ళూరు బాబురావు, కార్యదర్శులు వీ రాము, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కామినేని రామారావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, ఉప్పలపాటి రంగయ్య, జక్రం, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి యోగ శిక్షణ శిబిరం ప్రారంభం

నరసరావుపేట టౌన్, అక్టోబరు 3: యోగ శిక్షణ శిబిరం 7వ తేదీ నుంచి ప్రారంభం అవుతుందని శ్రీవెంకటేశ్వర యోగ సేవ కేంద్రం నరసరావుపేట శాఖ నిర్వాహకులు కూనిశెట్టి వెంకట జనార్ధన్ గురువారం తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని పట్టాభిరామస్వామి ఆలయం ఆవరణలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు 28 రోజుల పాటు శిక్షణ జరుగుతుందన్నారు. 42 యోగ భంగిమలు, ప్రాణాయామం, ధ్యానం, ఆహార నియమాలు, సూర్యనమస్కారాలు బోధిస్తామన్నారు. యోగ శిక్షణకు హాజరయ్యే వారు తప్పక బెడ్‌షీట్ తీసుకురావాలన్నారు. ఆసక్తి గలవారు కన్వీనర్ కూనిశెట్టి అనూరాధ సెల్ 9490846333, 9491665733 సంప్రదించాలన్నారు.

6న ఉన్నం నాగేశ్వరరావు సంస్మరణ సభ

నరసరావుపేట టౌన్, అక్టోబరు 3: పీకేఎం రాష్ట్ర కోశాధికారి ఉన్నం నాగేశ్వరరావు సంస్మరణ సభ ఈ నెల 6న సత్తెనపల్లిలోని వడ్డేపల్లిలో జరగనుందని పీకేఎం రాష్ట్ర కార్యదర్శి జె.కోటి వెల్లడించారు. సభను జయప్రదం చేయాలని గురువారం నరసరావుపేట ఇస్లాంపేటలో ఉన్నం నాగేశ్వరరావు సంస్మరణ సభ కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జె కోటి మాట్లాడుతూ రెండు దశాబ్దాల పైగా ప్రజా కళామండలి కళాకారుడుగా, డప్పు దరువుతో తన ఆట, పాట, మాటతో ప్రజలను ఉరూతలూగించిన గొప్ప కళాకారుడు ఉన్నం నాగేశ్వరరావు అన్నారు. కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుక చంద్రశేఖర్, పీడీఎం రాష్ట్ర నాయకుడు వై వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చికినం చిన్న, బీసీ నాయకుడు బాదుగున్నల శ్రీనివాసరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కామినేని రామారావు, తదితరులు పాల్గొన్నారు.

టిప్పరు, కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

నూజెండ్ల, అక్టోబరు 3: టిప్పర్, కారు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన చింతలచెరువు సమీపంలో గురువారం జరిగింది. వినుకొండ పట్టణానికి చెందిన కోట నవీన్ దర్శి నుంచి వస్తుండగా వినుకొండ వైపు నుంచి కురిచేడు వైపు వెళ్తున్న టిప్పర్ ఢీకొనటంతో రెండు వాహనాలు రోడ్డు మార్జిన్‌లోకి వెళ్ళాయి. ఈ సంఘటనలో నవీన్‌కు తీవ్ర గాయాలు కాగా వినుకొండ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.



కొత్తపల్లిలో డ్రోన్‌తో మందు పిచికారి కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, లాం ఫాం శాస్త్రవేత్తలు

డ్రోన్‌తో వరిపై కలుపు మందు పిచికారి

రొంపిచర్ల, అక్టోబరు 3: మండలంలోని కొత్తపల్లిలో డ్రోన్ ద్వారా వరిపై కలుపుమందు పిచికారి చేసే విధానాన్ని రైతులకు నమూనాగా వ్యవసాయ శాఖ అధికారులు పిచికారి చేయించి గురువారం రైతులకు చూపించారు. నామినీ గోల్డ్ కలుపు మందును డ్రోన్ ద్వారా పిచికారి చేశారు. ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రైతులకు ఖర్చుతగ్గే విధంగా ఈ నమూనాను చూపిస్తున్నట్లు ఏడీఏ మస్తానమ్మ తెలిపారు. అనంతరం ఎడ్వర్డుపేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు సాగుచేసిన పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో లాం ఫాం శాస్త్రవేత్తలు ప్రతిభ శ్రీ, అమరజ్యోతి, సీనియర్ శాస్త్రవేత్త వెంకట రాములు, పశు వైద్య అధికారి శ్రీకాంత్, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు. ఒక ఎకరాకు డ్రోన్ ద్వారా వంద ఎంఎల్ నామినీ గోల్డ్ కలుపు మందును ఏడు నిమిషాల్లో పిచికారి చేయవచ్చని ఏడీఏ మస్తానమ్మ తెలిపారు.

ఈపూరు ఎక్సైజ్ సీఐగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకారం

ఈపూరు, అక్టోబరు 3: ఈపూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐగా డీ వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు జిల్లా కందుకూరు నుంచి బదిలీపై వచ్చారు. ఎస్ఐగా కే వెంకటేశ్వర్లు విధులలో చేరారు. ఈయన పెదకూరపాడు నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఎస్ఐగా విధులు నిర్వహించిన స్వర్ణ రేవతి బదిలీపై కందుకూరు వెళ్ళారు. నూతనంగా విధులలో చేరిన సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అక్రమంగా మద్యం విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్లు

ఉపాధి పనులపై గ్రామ సభ

బొల్లాపల్లి, అక్టోబరు 3: మండలంలోని పేరూరుపాడులోని సచివాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు గుర్తింపు గ్రామసభను గురువారం సచివాలయంలో గ్రామస్థులతో ఏర్పాటు చేశారు. ఈ ఏడాది పేరూరుపాడులో చేపట్టాల్సిన పనుల వివరాలను గ్రామ సభ ఏర్పాటు చేయటం జరిగిందని ఏపీవో పులి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాట్ల వెంకటేశ్వర్లు, బొప్పూడి శ్రీనివాస్, దాచేపల్లి ఏడుకొండలు, కే నాగరాజు, ఉపాధి కూలీలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా దసరా ఉత్సవాలు ప్రారంభం



బ్రాహ్మీ అలంకారంలో శృంగేరి శంకరమఠంలో శారదాంబ అమ్మవారు, వినుకొండలో పూజలు నిర్వహిస్తున్న అఘోరా, రొంపిచర్లలో బాల అలంకారంలో వాసవి కన్యకా పరమేశ్వరి దేవి, విప్పర్లలో బాలా త్రిపుర సుందరి అలంకారంలో కామాక్షి అమ్మవారు

నరసరావుపేట, అక్టోబరు 3: జిల్లాలోని దేవాలయాల్లో దసరా ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారి ప్రత్యేక అలంకారాలను దర్శించుకుని పూజలు చేశారు.

శాంతి ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో...

వినుకొండ టౌన్, అక్టోబరు 3: మండలంలోని విఠంరాజుల్లి గ్రామ సమీపంలోని శాంతి ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ వరకు, తొమ్మిది రోజులపాటు శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో భాగంగా తొమ్మిది రోజుపాటు రాజశ్యామల యాగం చేయనున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఉదయం ఆరుగంటల నుంచి గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, నవగ్రహ మండపారాధన, యోగిని మండపారాధన, 108 శ్రీచక్రకలశ స్థాపన, అమ్మవారి విగ్రహ స్థాపన, మూడు అడుగులు శ్రీచక్ర మెరుగు స్థాపన, అభిషేక పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

రొంపిచర్ల మండలంలో..

రొంపిచర్ల, అక్టోబరు 3: మండలంలోని రొంపిచర్ల, విప్పర్ల, వడ్లమూడివారిపాలెం, కొత్తపల్లి గ్రామాల్లోని వాసవి, వల్లభేశ్వరస్వామి, నీలకంఠేశ్వర స్వామి, హరిహర క్షేత్రంలో దేవీ నవరాత్రులు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రొంపిచర్లలో వాసవి అమ్మవారు బాల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విప్పర్లలోని కామాక్షి అమ్మవారు బాల త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. రొంపిచర్ల వాసవి అమ్మవారి ఆలయంలో జరిగిన రుద్రాభిషేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వాసవి అమ్మవారికి జరిగిన ప్రత్యేక పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజల్లో ఆలయ ధర్మకర్త మద్ది రామచంద్రరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సాయంత్రం భజనా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

బొల్లాపల్లి మండలంలో..

బొల్లాపల్లి, అక్టోబరు 3: మండలంలోని వెల్లటూరు రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, గంగాపార్వతి సమేత సోమేశ్వరస్వామి దేవాలయాల్లో గజ్జవల్లి సుబ్బారావు కుమారులు గజ్జవల్లి ప్రసాదరావు, గజ్జవల్లి మునేశ్వరరావు, గజ్జవల్లి పవన్ కుమార్ దంపతులు అమ్మవారికి వారికి పంచామృత ద్రవ్యాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం మొదటిరోజు స్వామివారు బాల త్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. 60 సంవత్సరాల నుంచి దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో మొదటి గజ్జవల్లి సుబ్బారావు కుమారులు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న గజ్జవల్లి కుటుంబ సభ్యులు

నూజెండ్లలో...

నూజెండ్ల, అక్టోబరు 3: మండల కేంద్రం నూజెండ్ల చెన్నకేశవస్వామి దేవాలయం, రవ్వవరం వెంకటేశ్వర జగన్నాథపీఠం, ఐనవోలు, వీ అప్పాపురం తదితర గ్రామాల్లో దసరా ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. భక్తులకు అమ్మవారు బాల త్రిపుర సుందరిగా దర్శన మిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి.

లింగంగుంట్ల ఎస్టీ కాలనీలో స్వచ్ఛత హి సేవ

నరసరావుపేట రూరల్, అక్టోబరు 3: మండలంలోని లింగంగుంట్ల ఎస్టీ కాలనీ వద్ద గురువారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బాలునాయక్ పాల్గొన్నారు. రోడ్లవెంట చెత్త, పిచ్చి మొక్కలు తొలగించారు. అనంతరం చెత్తను ట్రాక్టర్‌లో తరలించారు. అనంతరం శానిటేషన్ సిబ్బందిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ వీధులు శుభ్రంగా ఉంటే గ్రామాల్లో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. స్వచ్ఛ పల్నాడుగా తయారుచేసేందుకు పారిశుధ్యంపై ప్రజలు దృష్టి సారించాలన్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ నాయకుడు గంగుల పెద్దిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కేవీ శివప్రసాద్, భరత్, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేట మండలం లింగంగుంట్లలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, టీడీపీ నాయకులు

శివారు ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు

వినుకొండ, అక్టోబరు 3: వినుకొండ మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో గురువారం ఏనుగుపాలెం రోడ్డులోని కాశినాయన ఆశ్రమం సమీపంలో సచ్ఛత హి సేవ కార్యక్రమాలను చేపట్టారు. ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్తను ప్రొక్లయిన్ సాయంతో గురువారం తొలగించే పనులు చేపట్టారు. వినుకొండ పట్టణ శివారు ప్రాంతాల్లో చెత్త పేరుకు పోవడంతో పాటు పర్యావరణ కాలుష్యం పెరిగి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాహనదారుల ఫిర్యాదు మేరకు ఈ చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు. పేరుకుపోయిన చెత్తకు నిప్పు పెడుతుండటంతో స్థానికంగా నివాసం ఉండలేక పోతున్నామని ఆప్రాంత వాసులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇక మీదట రోడ్లపై చెత్తలేకుండా వాహన దారులకు ఇబ్బందులు తొలగిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.



ఏనుగుపాలెం రోడ్డులో చెత్త, పిచ్చి చెట్లు తొలగింపును పర్యవేక్షిస్తున్న కమిషనర్

శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలి

● సీనియర్ సిటిజన్లతో డీఎస్పీ నాగేశ్వరరావు

నాదెండ్ల, అక్టోబరు 3: శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో సీనియర్ సిటిజన్లు భాగస్వాములు కావాలని డీఎస్పీ నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని గణపవరంలో నిర్మాణంలో ఉన్న ప్రత్తిపాటి పుల్లారావు ముఖద్వారం సెంటర్‌లో సీనియర్ సిటిజన్‌లతో డీఎస్పీ ఫ్రెండ్లీ పోలీసు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలను పెద్దలుగా మీరు పరిష్కరించాలన్నారు. చిన్న సమస్యలను పోలీసు స్టేషన్ వరకు వస్తే కేసులు నమోదవుతాయని, తరువాత కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని వివరించారు. సమావేశంలో గ్రామానికి చెందిన సీనియర్ సిటిజన్‌లు కెల్లంపల్లి అచ్చయ్య కంచర్ల శ్రీనివాసరావు, పెంటాల హనుమంతరావు, శేషయ్య, కాట్రు కృష్ణారావు, గాలి బుచ్చయ్య, దారా కొండయ్య, తూబాటి శేషు తదితరులు పాల్గొన్నారు.



పెరిగిన ధరలు తగ్గించాలని శివయ్య స్తూపం సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

పెరిగిన నిత్యావసరాల ధరలు తగ్గించాలి

● కేంద్రం పెంచిన 20శాతం దిగుమతి సుంకాన్ని తగ్గించాలి


వినుకొండ టౌన్, అక్టోబరు 3: నిత్యావసర సరుకులపై కేంద్ర ప్రభుత్వం విధించిన 20శాతం దిగుమతి సుంకాన్ని, నిత్యావసరాల ధరలు తగ్గించాలని వినుకొండ సీపీఐ ఆధ్వర్యంలో శివయ్య స్తూపం సెంటర్‌లో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యావసరాలైన కందిపప్పు, మినపప్పు, పామాయిల్, శనగనూనె, ఉల్లిగడ్డలు, వెల్లుల్లి, మిర్చి, చింతపండు తదితర సరుకులపై కేంద్ర ప్రభుత్వం 20శాతం దిగుమతి సుంకం విధించారని, పెరిగిన ధరల కారణంగా పేదలకు సరుకులు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దసరా, దీపావళి పండుగ రోజుల్లో పెరిగిన ధరల కారణంగా బెంబేలెత్తిపోతున్నారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెరిగిన ధరలను వెంటనే తగ్గించాలని, లేని పక్షంలో పెరిగిన ధరలపై ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బూదాల శ్రీనివాసరావు, లాల్‌ఖాన్, సోడాలత సాంబయ్య, నాగేశ్వరమ్మ, మల్లికార్జునరావుతో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పెరిగిన ధరలు తగ్గించాలని నినాదాలు చేశారు.

పురుగు మందుల వ్యాపారిపై రైతుల ఫిర్యాదు

నాదెండ్ల, అక్టోబరు 3: మండలంలోని గొరిజవోలు గ్రామానికి చెందిన పలువురు రైతులు పురుగు మందుల వ్యాపారిపై నాదెండ్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొరిజవోలు గ్రామానికి చెందిన బాజీరెడ్డి కొన్నాళ్ళ క్రితం గ్రామంలో పురుగు మందుల షాపు నిర్వహించారు. ఆ తరువాత ఆ షాపును నరసరావుపేట పట్టణానికి మార్చాడు. గ్రామంలోని రైతుల వద్ద అప్పుగా నగదు తీసుకోవటంతో వారి వద్ద కొనుగోలుచేసిన ఉత్పత్తులకు సంబంధించి సుమారు రూ.2కోట్లు బకాయిపడ్డాడు. కొన్నాళ్ళుగా ఆయన రైతులకు అందుబాటులో లేకపోవటంతో పోలీసులకు ఫిర్యాదుచేశాడు. కాగా కొద్దిరోజుల క్రితం బాజీరెడ్డి తనకు వ్యాపారానికి సంబంధించి రూ.4కోట్లకు పైగా బకాయిలు రావాల్సి ఉందని ఫిర్యాదు చేశారు. తనకు రావాల్సిన బకాయిలు వస్తే రైతులకు చెల్లిస్తానని ఫిర్యాదులో పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

వినుకొండ టౌన్, అక్టోబరు 3: ప్రైవేట్ ఫైనాన్షియర్ల ఒత్తిడి తట్టుకోలేక ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలోని ఏనుపాలెంలో బుధవారం చోటు చేసుకుంది. బాధితుడి తల్లి రమాదేవి తెలిపిన వివరాల ప్రకారం వినుకొండలోని చోళ ఫైనాన్సులో కళ్యాణ్ ఆటోను ఫైనాన్సు తీసుకుని జీవనం సాగిస్తున్నాడు. గత రెండు నెలలుగా అన్‌సీజన్ కావడంతో రెండు కిస్తీలు కట్టలేకపోయాడు. దీంతో ఫైనాన్సు కంపెనీ ఏజంటు కళ్యాణ్‌ను సంప్రదించి డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తెచ్చాడు. డబ్బులు కట్టకపోతే 10మందితో మీ గ్రామంలో పంచాయతీ పెడతామని బెదిరించడంతో తట్టుకోలేక, గ్రామ సమీపంలోని పంట పొలాల్లో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పొలంలో అపరస్మారక స్థితిలో పడిఉన్న కల్యాణ్‌ను సమీపంలోని రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బాధితుడిని వినుకొండలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వినుకొండలో చికిత్స పొందుతున్న కళ్యాణ్

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి: జీవీ

వినుకొండ టౌన్, అక్టోబరు 3: ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని, పేదలకు సేవ భగవంతునికి సేవ చేసినట్టేనని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఇటీవల ఢిల్లీలోని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషనర్ నుంచి డాక్టరేట్ అందుకున్న మానవ సేవ సమితి కార్య నిర్వాహక కార్యదర్శి పీవీ సురేష్‌కు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు గురువారం ఘనంగా సన్మానించారు. అనంతరం జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ పీవీ సురేష్ రానున్న రోజుల్లో మరెన్నో అవార్డులు అందుకుని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. సమాజ సేవ కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిరస్మరణీయులు గాంధీ, మోక్షగుండం

● విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, అక్టోబరు 3: ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న మహనీయులు మహాత్మాగాంధీ, ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కొనియాడారు. గురువారం చిలకలూరిపేట పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో మహాత్మాగాంధీ, భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆవిష్కరించారు. లైసెన్స్‌డ్ ఇంజనీర్లు, సర్వేయర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగానే స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా విజయవాడ వరదల్లో బాధితులకు విశేష సేవలు అందించిన మునిసిపల్ పారిశుధ్య కార్మికులు, సహాయక చర్యల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బందిని అభినందించారు. పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం తరుపున దుస్తులు పంపిణీ చేశారు. చెత్త సేకరణ వాహనాలను అందించారు. 1వ తేదీనే జీతాలు, పింఛన్లు పంపిణీ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిది, సీఎం చంద్రబాబుదని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్తిపాటిని కలిసిన ఎక్సైజ్ సీఐ

చిలకలూరిపేట అర్బన్, సెప్టెంబరు 3: మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బదిలీపై చిలకలూరిపేట వచ్చిన ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వినయ్‌కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ గురవేశ్వరిలు కలసి పుష్పగుచ్ఛం అందించారు. కాగా చిలకలూరిపేటకు బదిలీపై వచ్చిన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేఎల్‌రావు కూడా మర్యాదపూర్వకంగా ప్రత్తిపాటిని కలిశారు.



ప్రత్తిపాటిని మర్యాదపూర్వకంగా కలసిన ఎక్సైజ్ సీఐ వినయ్ కుమార్, ఎస్ఐ గురవేశ్వరి

నకిలీ విత్తనంతో నష్టపోయా.. న్యాయం చేయరూ

నాదెండ్ల, అక్టోబరు 3: నకిలీ మొక్క జొన్న (స్వీట్ కార్న్) విత్తనాల సాగుతో నష్టపోయినట్లు మండలంలోని చందవరం గ్రామానికి చెందిన గొంటు శ్రీనివాసరెడ్డి మండల వ్యవసాయ అధికారి ఎ.హరిప్రసాద్‌కు ఫిర్యాదు చేశాడు. గురువారం ఈ విషయంపై రైతు శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పది సంవత్సరాలుగా శ్రీనివాసరెడ్డి స్వీట్ కార్న్ నాలుగు ఎకరాల్లో సాగు చేస్తున్నాడు. ఈ ఏడాది కూడా రెండు ఎకరాల్లో సాగు చేసేందుకు గుంటూరులోని ఓ దుకాణంలో ఓ కంపెనీకి చెందిన విత్తనాన్ని తెచ్చి నాటాడు. కాపునకు వచ్చే సమయానికి కండెలో సగం విత్తనాలు కూడా లేవు. సుమారు ఇప్పటి వరకు లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టినట్లు తెలిపాడు. గతంలో సాగు చేసిన మొక్క జొన్న ఎనిమిది నుంచి పది టన్నుల వరకు దిగుబడి వచ్చింది. ప్రస్తుతం విత్తనం నకిలీది కావటంతో రెండు టన్నుల మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేదని శ్రీనివాసరెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. కొనుగోలుకు సంబంధించి ఆధారాలన్నీ తన వద్ద ఉన్నాయని, ఈ విషయం గురించి షాపు వారి దృష్టికి తీసుకు వెళ్ళినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయాడు. తనకు న్యాయం చేయాలని వ్యవసాయ అధికారులకు విన్నవించుకున్నాడు.



మొక్క జొన్న కండె చూపిస్తున్న రైతు శ్రీనివాసరెడ్డి



మిల్లర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్

రేషన్ బియ్యం రీసైక్లింగ్ చేపడితే చర్యలు: తహసీల్దార్ సురేష్

వినుకొండ, అక్టోబరు 3: ఎవరైనా రైస్ మిల్లర్లు రేషన్ రీసైక్లింగ్ చేపడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ సురేష్ హెచ్చరించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రైస్ మిల్లర్లతో తహసీల్దార్ సురేష్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మిల్లు నిర్వహణకు అన్ని అనుమతులు తీసుకుని మిల్లులు నడుపుకోవాలని యజమానులకు సూచించారు. ఎవరైనా రేషన్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేపట్టినట్లు తమ దృష్టికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీహరి, డీటీ వెంకటేశ్వర్లు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు : ఏవో

యడ్లపాడు, అక్టోబరు 3: సరైన యాజమాన్య పద్ధతులతో పత్తిలో అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి సీహెచ్ సరిత అన్నారు. మండలంలోని మైదవోలు, యడ్లపాడు గ్రామాలలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా ఆయా గ్రామాల్లోని పత్తి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులు పత్తి సాగులో అవలంభిస్తున్న పద్ధతులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం పత్తి 100రోజుల దశలో ఉందని, పచ్చదోమ, రసం పీల్చు పురుగులు, తామరపురుగులు పంటను ఆశిస్తున్నాయన్నారు. నివారణకు వేప కషాయం లేదా వేపనూనె 5మి.లీ, దీనితోపాటు ఫ్లోనికామైడ్ 3గ్రాములు, ఫిప్రోనిల్ 2మి.లీలు, సల్ఫోక్సాఫ్లోర్ 1 గ్రామును లీటరు నీటిలో కలుపుకుని పైరుపై పిచికారీ చేయాలన్నారు. గులాబీ రంగు పురుగు నివారణకు తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. కాగా ఆయా గ్రామాల రైతులు రైతులకు ఎంతగానో ఉపయోగపడే తైవాన్ స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టలు రాయితీపై అందించాలని రైతులు కోరారు. అనంతరం పశుసంవర్ధకశాఖ ఏడీ రాధాకృష్ణ మాట్లాడుతూ మినీ గోకులాలు, రైతులకు లభించే రాయితీల గురించి వివరించారు. అంతేగాకుండా పశువుల బీమా, పశువులలో వ్యాపించే గాలికుంటు వ్యాధినివారణ, పశుగ్రాస విత్తనాల రాయితీల గురించి వివరించారు. కార్యక్రమంలో మైదవోలు, యడ్లపాడు గ్రామాల రైతులు, రైతుసేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని సాతులూరు, గొరిజవోలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. క్షేత్ర స్థాయి పరిశీలన తరువాత ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో గ్రామ సభలు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శోభారాణి, వ్యవసాయ అధికారి హరిప్రసాదు, పశు వైద్యాధికారి శ్రీలక్ష్మి, సూపర్ వైజర్ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.